




RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం – మా పంతం








కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 245 బుధవారం, సెప్టెంబర్ 23 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com


## అర్హత పట్టాలా.. అడ్డదారి పట్టాలా? పీహెచ్‌డీలపై

# పెరుగుతున్న సందేహాలు

**- ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు తావులేకుండా ధ్రువపత్రాల పరిశీలనకు డిమాండ్**

హైదరాబాద్ జోర్దార్ నిఘా విభాగం

సర్కారు డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్ల నియామకాలకు పీహెచ్‌డీ అర్హత కీలకంగా మారడంతో కొన్ని యూనివర్సిటీల నుంచి పొందుతున్న పట్టాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లోని కొన్ని విద్యాసంస్థలను ఆశ్రయించి తక్కువ సమయంలో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు చూపిస్తున్న అభ్యర్థుల అర్హతలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తాజాగా రూపొందించిన ఎంపిక విధానంలో అభ్యర్థి అకడమిక్ ప్రతిభకు 50 మార్కులు, రాత పరీక్షకు 40, ఇంటర్వ్యూకు 10 మార్కులు కేటాయించినట్లు తెలుస్తోంది. దీంతో అకడమిక్ స్కోరులో అధిక ప్రాధాన్యం కలిగిన అర్హతలను సాధించేందుకు కొందరు అభ్యర్థులు అనధికార మార్గాలను ఆశ్రయించే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పీహెచ్‌డీ అర్హతకు లభించే మార్కులు ఉద్యోగ నియామకాల్లో తుది ఫలితాన్ని ప్రభావితం చేసే పరిస్థితి ఉంటే, ఆ పట్టా ఏ యూనివర్సిటీ నుంచి వచ్చింది? అభ్యర్థి ఎప్పుడు ప్రవేశం పొందారు? పరిశోధన అంశం ఏమిటి? మార్గదర్శకుడు ఎవరు? పరిశోధనా పత్రాలు ఎక్కడ ప్రచురితమయ్యాయి? వైవా, పరీక్షలు ఎప్పుడు నిర్వహించారు? వంటి అంశాలను అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర రాష్ట్రాల యూనివర్సిటీల పేరుతో పీహెచ్‌డీ పట్టాలు ఇప్పిస్తామని కొందరు మధ్యవర్తులు అభ్యర్థులను సంప్రదిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో డబ్బుల లావాదేవీలు ఉన్నాయా? నిబంధనలకు విరుద్ధంగా అర్హతలు పొందినవారు ఎవరైనా ఉన్నారా? అనే అంశాలపై అధికారిక విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఏళ్ల తరబడి పరిశోధన చేసి, నిబంధనలను పాటిస్తూ పీహెచ్‌డీ సాధిస్తున్న అభ్యర్థులకు అన్యాయం జరగకుండా నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉంది.




పీహెచ్‌డీ ధ్రువపత్రాల పరిశీలనను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా సంబంధిత యూనివర్సిటీల నుంచి నేరుగా వివరాలు సేకరించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అభ్యర్థుల ప్రవేశ రికార్డులు, ఫీజు చెల్లింపులు, పరిశోధన పురోగతి, పరిశోధనా పత్రాలు, పరీక్షలు, వైవా, ఫలితాలు వంటి వివరాలను పరిశీలిస్తే పట్టా పొందిన విధానంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా యూనివర్సిటీల అధికారిక ఈమెయిల్ రికార్డులు, డిజిటల్ సమాచారాన్ని ధ్రువీకరించడం ద్వారా అనుమానాస్పద ధ్రువపత్రాలను గుర్తించవచ్చని చెబుతున్నారు.

## కరీంనగర్ ఏ డి ఏ కార్యాలయంలో

# అక్రమ ఓడి ఎలా ఇస్తారు?

**కరీంనగర్ జిల్లా వ్యవసాయ శాఖలో మరో అక్రమ భాగోతం**




(కరీంనగర్ జోర్దార్ వ్యవసాయ ప్రతినిధి)

ప్రభుత్వం గత ఏప్రిల్ నెలలో వ్యవసాయ శాఖలోని ఉద్యోగులకు బదిలీలు నిర్వహించగా, ఆ బదిలీల్లో కౌన్సిలింగ్ ప్రకారం వ్యవసాయ శాఖ అన్ని కేడర్ల ఉద్యోగులు బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక ఏడిఏ జిల్లా వ్యవసాయ శాఖలో ఉన్నత అధికారులను బెదిరించి నిబంధనలకు విరుద్ధంగా ఆన్ డ్యూటీ పెట్టించుకోవడం పట్ల ఆ శాఖ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ ఏడిఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఉద్యోగిని మానకొండూరు ఏడిఏ కార్యాలయానికి గత ఏప్రిల్ నెలలో ప్రభుత్వం బదిలీ చేసింది. ఒకసారి బదిలీ జరిగిన తర్వాత ఉద్యోగులకు ఎట్టి పరిస్థితుల్లోనూ డిప్యూటేషన్ ఆర్డర్ ఇవ్వడం నిబంధనకు విరుద్ధం. ఆన్ డ్యూటీలో వెళ్లడం కూడా అంతకన్నా అవినీతికి మరొకటి లేదు. కానీ గతంలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చే చివాట్లు తిని సరెండర్ కు గురైన ఒక అధికారి జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులను నయానా భయానా బెదిరించి తనకు అనుకూలమైన వ్యక్తిని మానకొండూరు నుండి కరీంనగర్ ఏడీకి బదిలీ చేయడం వెనుక భారీ ఎత్తున అవినీతి అక్రమాలు సాగాయని సామాజికవేత్త రాధాకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. హుజురాబాద్ ఏ డి ఏ కార్యాలయంలో గత పది నెలలుగా జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ ఉన్నప్పటికీ అక్కడి పోస్టును భర్తీ చేయడంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కరీంనగర్ లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ను హుజురాబాద్ వేయాల్సి ఉండగా అతి సమీపంలోని మానకొండూరుకు నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఫోకల్ లో పనిచేసిన ఉద్యోగి నాన్ లోకల్ ప్రాంతానికి వెళ్లాలి. కానీ కరీంనగర్ జిల్లాలోని ఒక ఏడిఏ సహకారంతో కరీంనగర్ కు సమీపంలోని మానకొండూరు ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్ నిబంధనలకు విరుద్ధంగా మరలా కరీంనగర్ రేడియో కార్యాలయంలో విధులు నిర్వహించడం ఏమిటని రాధాకృష్ణ ప్రశ్నించారు. కొంతకాలం కిందట పదవి విరమణ చేసిన జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారిని కూడా ఈ అధికారి వేదింపుల వల్ల నన్ను పదవి విరమణ కార్యక్రమం చేసుకోండి మహాప్రభు అంటూ గ్రూపులోనే వేడుకొనడం కొసమెరుపు. కరీంనగర్ ఏడీఏ కార్యాలయంలో నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న అవినీతి అక్రమాలపై ప్రభుత్వం కమిటీ వేసి విచారణ జరిపించాలని సామాజికవేత్త రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ శాఖను ఇలాగే వదిలేస్తే సామాన్య ఉద్యోగులకు, అటు వినియోగదారులకు తీవ్ర నష్టం చేకూరుతుందని వినతులు వెల్లువెత్తినా అధికారులు పట్టించుకోకపోవడం వెనక అక్రమాల దందా వెలుగులోకి వస్తుంది. ప్రభుత్వం కండ్లు తెరిచి వెంటనే విచారణ జరిపించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు

## పౌరసరఫరాల శాఖలో

# రూ.300 కోట్ల నష్టం ఆరోపణలు!

**- సన్న ధాన్యం దారి మళ్లింపుపై సమగ్ర విచారణకు బాధ్యత గల పౌరుడి డిమాండ్**

(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రైతులను ఆదుకోవాలనే ప్రభుత్వ ఉద్దేశానికి కొందరు అధికారులు, రైస్ మిల్లర్లు తూట్లు పొడుస్తున్నారని కరీంనగర్‌కు చెందిన కాచం శ్రీనివాస్ ఆరోపించారు. సన్న ధాన్యాన్ని పక్కదారి పట్టించి, ప్రభుత్వానికి మరియు పౌరసరఫరాల సంస్థకు సుమారు రూ.300 కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

### సన్న ధాన్యాన్ని దొడ్డు రకంగా మార్చుతున్నారా?

సన్న రకం ధాన్యాన్ని సాధారణ రకం ధాన్యంగా తప్పుదారి పట్టించి కేటాయిస్తున్నారనే ఆరోపణలు ఫిర్యాదులో ఉన్నాయి. ఈ విధంగా నాణ్యమైన సన్న ధాన్యాన్ని పక్కదారి పట్టించడం వల్ల ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

### ఒక్క లారీకి రూ.2.17 లక్షల నష్టమా?

పౌరసరఫరాల లెక్కల ప్రకారం ఒక్క లారీ ధాన్యానికి సుమారు రూ.2,17,500 వరకు నష్టం వాటిల్లుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయిలో కొనసాగితే ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం సంభవించే అవకాశం ఉందని ఆరోపించారు.

### ఒక్క బెడ్‌కు రూ.15 లక్షల నష్టమా?

ధాన్యం దారి మళ్లింపు వ్యవహారం పెద్ద స్థాయిలో జరుగుతున్నట్లయితే ఒక్క బెడ్ స్థాయిలోనే ప్రభుత్వానికి సుమారు రూ.15 లక్షల ప్రజాధనం నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

### బహిరంగ మార్కెట్‌కు సన్న ధాన్యం?

ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన సన్న ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.3,500 వరకు విక్రయిస్తూ కొందరు మిల్లర్లు అక్రమంగా లాభాలు పొందుతున్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. అనంతరం ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు దొడ్డు లేదా మధ్యస్థ రకం బియ్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు కూడా చేశారు.




### ఒక్క లారీపై రూ.2.15 లక్షల అక్రమ లాభమా?

ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ప్రభుత్వానికి సరఫరా చేయడం ద్వారా ఒక్క లారీపై సుమారు రూ.2,15,000 వరకు అక్రమ లాభం పొందుతున్నారనే ఆరోపణలు ఫిర్యాదులో ఉన్నాయి.

### అధికారుల కుమ్మక్కుపై ఆరోపణలు

మిల్లర్లు, కొందరు అధికారులు కుమ్మక్కై వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోందని కాచం శ్రీనివాస్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్వతంత్రంగా, సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన కోరారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వానికి, పౌరసరఫరాల సంస్థకు నష్టం కలిగించిన వారిని గుర్తించి బాధ్యులైన అధికారులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. పౌరసరఫరాల శాఖలో జరగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టి, ప్రజాధనాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# టేకుమట్లలో మద్యం జోరు..

# పల్లెల్లో బెల్ట్ షాపుల హవా!




భూపాలపల్లి జోర్దార్ నిఘా విభాగం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని వైన్స్ దుకాణాల నుంచి గ్రామాలకు మద్యం తరలించి, కిరాణా దుకాణాలు, ఇళ్ల పరిసరాలు, ఇతర ప్రదేశాల్లో బెల్ట్ షాపుల తరహాలో విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం అందుబాటులో ఉంటోందని, అధికారిక దుకాణాల పరిధిని దాటి విక్రయాలు సాగుతున్నాయని చెబుతున్నారు. కొన్ని చోట్ల మద్యం సీసాలపై నిర్ణయించిన ధర కంటే రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. గ్రామాల్లో మద్యం సులభంగా లభించడం వల్ల యువతపై ప్రభావం పడటంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, గొడవలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్ షాపులపై అప్పుడప్పుడు తనిఖీలు జరుగుతున్నప్పటికీ అక్రమ విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో మద్యం ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది, ఎవరి ఆధ్వర్యంలో విక్రయాలు జరుగుతున్నాయనే అంశాలపై ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ విక్రయాలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, గ్రామాల్లో అనధికారిక మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# పుట్టినరోజు వేడుకల్లో అపశృతులు జాగ్రత్త అవసరం

- **పుట్టినరోజు వేడుకల్లో ఉపయోగించే ఫోమ్ స్ప్రే ప్రమాదకరం**
- **కొవ్వొత్తి మంటతో ముఖానికి మంటలు అంటుకునే అవకాశం**
- **కళ్లలో పడితే తీవ్ర ఇబ్బందులు.. పిల్లల విషయంలో మరింత అప్రమత్తత అవసరం**

పుట్టినరోజు వేడుకలు ఆనందంగా జరుపుకోవడం సహజమే. అయితే వేడుకల్లో ఉపయోగించే కొన్ని వస్తువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

పుట్టినరోజు వేడుకల్లో చల్లుకునే నురగలాంటి ఫోమ్ స్ప్రేలు కొన్ని మండే స్వభావం కలిగి ఉంటాయి. కొవ్వొత్తి వెలిగించి ఉన్న సమయంలో ఫోమ్‌ను దాని వైపు చల్లడం, ముఖంపై ఫోమ్ ఉండగా కొవ్వొత్తులను ఊదడం వంటి చర్యలతో ముఖానికి మంటలు అంటుకునే ప్రమాదం ఉంది.

అదేవిధంగా ఫోమ్ కళ్లలో పడితే కంటికి చికాకు, ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి సమస్యలతో ఈ వారంలోనే ఇద్దరు బాధితులు వైద్యులను సంప్రదించినట్లు వైద్యులు చెబుతున్నారు.

కేక్‌పై నేరుగా ఇలాంటి ఫోమ్ స్ప్రేలను ఉపయోగించడం కూడా నివారించడం మంచిది. ఫోమ్‌లోని రసాయనాలు ఆహారంతో కలిసే అవకాశం ఉండటంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తవచ్చు.

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి**

పిల్లల పుట్టినరోజు వేడుకల్లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఫోమ్ స్ప్రేలు, కొవ్వొత్తులు మాత్రమే కాకుండా బెలూన్లు, అలంకరణ వస్తువులు కూడా చిన్నారులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

చిన్నపిల్లలు రంగురంగుల అలంకరణ వస్తువులను నోట్లో పెట్టుకునే ప్రమాదం ఉంది. బెలూన్ ముక్కలు లేదా ఇతర చిన్న వస్తువులు గొంతులో ఇరుక్కునే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల పిల్లలను ఎప్పటికప్పుడు పెద్దల పర్యవేక్షణలో ఉంచడం అవసరం.

**సురక్షితమైన పుట్టినరోజు వేడుకలకు ప్రాధాన్యం**

ఆనందాన్ని ఇచ్చే పుట్టినరోజు వేడుకలు ప్రమాదాలకు కారణం కాకుండా జాగ్రత్తలు పాటించాలి. పాశ్చాత్య పద్ధతులను అనుసరించే సమయంలో భద్రతను విస్మరించకుండా, మన భారతీయ సంప్రదాయాల్లోని ఆచారాలను కూడా పాటిస్తూ వేడుకలు నిర్వహించవచ్చు.

**భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో పుట్టినరో జులను సంప్రదాయబద్ధంగా జరుపుకునే పద్ధ తులు ఉన్నాయి. వాటిలో కొన్ని:**

1. **కేక్ లేదా తీపి పదార్థాలను పరస్పరం తినిపించడం**
2. **దేవాలయానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకోవడం**
3. **హారతి ఇవ్వడం**
4. **కొత్త బట్టలు ధరించడం**
5. **మొదటి పుట్టినరోజున తల వెంట్రుకలు తీయించడం వంటి సంప్రదాయాలు**
6. **భోజనానికి ముందు తీపి పదార్థాలు తినిపించడం**
7. **పెద్దల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం**

ప్రాంతానుసారం పుట్టినరోజు ఆచారాలు మారుతూ ఉంటాయి. ఆధునికత కారణంగా కొన్ని సంప్రదాయాలు క్రమంగా తగ్గుతున్నప్పటికీ, ఇప్పటికీ అనేక కుటుంబాలు వాటిని కొనసాగిస్తున్నాయి.

పుట్టినరోజు వేడుకల ఉద్దేశం ఆనందం పంచుకోవడం.. ప్రమాదాలను ఆహ్వానించడం కాదు.
అందువల్ల పిల్లల పుట్టినరోజు వేడుకల్లో ప్రమాదకరమైన ఫోమ్ స్ప్రేలు, మంటకు దగ్గరగా ఉపయోగించే వస్తువులు, చిన్నారులు నోట్లో పెట్టుకునే అవకాశం ఉన్న అలంకరణ వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

డా. శ్రీనివాసరెడ్డి

## దళిత జర్నలిస్ట్ ఫోరం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:కర్నూలు జిల్లా కేంద్రంలోని చల్లా కాంపౌండ్‌లో దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మంగళవారం ఆవిష్కరించారు.
ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కాసపోగు జాన్, రాష్ట్ర నాయకులు రంగముని, ఎం. వీరేష్, బీఆర్ఎస్వీ నాయకుడు మత్తలి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 7న సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో మహాసభలు నిర్వహించనున్నట్లు కాసపోగు జాన్ తెలిపారు. కార్యక్రమానికి హాజరవుతానని ఎమ్మెల్యే విజయుడు హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## గణనాథులను దర్శించుకున్న శాసనసభాపతి



వికారాబాద్, జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కొలువుదీరిన గణనాథులను తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి కార్యక్రమాలు ప్రజలకు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు



జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:గద్వాల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహిస్తున్న సదరం ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా మంగళవారం పరిశీలించారు. అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. శిబిరంలో 92 మంది పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 58 మంది చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

శిబిరం బుధవారం కూడా కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## రిమ్స్‌లో చిన్నారుల మృతిపై జోగు రామన్న ఆవేదన



ఆదిలాబాద్, జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చిన్నారుల మృతిపై మాజీ మంత్రి జోగు రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్‌తో కలిసి రిమ్స్‌ను సందర్శించి ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య లోపాలపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి, వైద్యులను మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జోగు రామన్న డిమాండ్ చేశారు.

## బీసీ విద్యార్థులకు రూ.1.30 కోట్ల స్కాలర్‌షిప్ నిధులు



వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:వికారాబాద్ జిల్లాలో 2026--27 విద్యా సంవత్సరానికి బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం ఆర్టీఎఫ్ కింద రూ. 86,48,500, ఎంటీఎఫ్ కింద రూ. 44,00,160 నిధులు మంజూరైనట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి తెలిపారు. స్కాలర్‌షిప్‌లు సకాలంలో మంజూరు కావడంతో పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఇంకా దరఖాస్తు చేసుకోకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## టేకుమట్లలో పంటల పరిశీలన తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తల సూచనలు



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జయశంకర్ భూపాలపల్లి ఆధ్వర్యంలో టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి, వరి, కంది, పసుపు, మిరప పంటలను శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రైతులతో నేరుగా మాట్లాడిన శాస్త్రవేత్తలు పంటల పరిస్థితిని పరిశీలించి పురుగులు, తెగుళ్లు, పోషక లోపాలు, ఇతర సమస్యలను గుర్తించారు. సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. పత్తిలో రసంపీల్చే పురుగుల నియంత్రణకు సల్ఫాక్సాఫ్లోర్, అఫిడోపైరోపెన్ లేదా స్పైరోటెట్రామాట్ ం ఇమిడాక్లోప్రిడ్‌ను సిఫార్సు చేసిన మోతాదులో అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలని తెలిపారు. పురుగుల పర్యవేక్షణకు ఎకరాకు 12 నీలం, తెలుపు స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పింక్ బోల్‌వార్మ్ నివారణకు ఎకరాకు 4--5 లింగకర్షక బుట్టలు ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని పర్యవేక్షించాలని తెలిపారు. అవసరాన్ని బట్టి ఎమామెక్టిన్ బెంజోయేట్, ఫ్లూబెండియామైడ్ లేదా క్లోరాంట్రానిలిప్రోల్‌ను సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించాలని సూచించారు. వరి పంటలో మోగి పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్‌ను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయాలని, కంది పంటలో ఆకు ముడత పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ ం వేపనూనె లేదా సిఫార్సు చేసిన మోతాదులో ఏసిఫేట్ ఉపయోగించాలని సూచించారు. పసుపులో దుంప ఈగ నివారణకు సిఫార్సు చేసిన విధంగా కార్బోఫ్యూరాన్ వినియోగించాలని తెలిపారు. మిరపలో క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలకు అనుగుణంగా సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. రైతులు పురుగు, తెగుళ్ల ఉధృతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పురుగుమందులను సిఫార్సు చేసిన మోతాదులో మాత్రమే, అవసరమైనప్పుడు వినియోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు.
ఈ క్షేత్ర పర్యటనలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జయశంకర్ భూపాలపల్లి కోఆర్డినేటర్ డా. కె. మదన్ మోహన్ రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ శాస్త్రవేత్తలు డా. పద్మజ, డా. వీరన్న, డా. క్రాంతికుమార్, మండల వ్యవసాయ అధి కారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

## రోగుల సహాయకుల కోసం ఉచిత వసతి గృహం ప్రారంభం



హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వసతి గృహాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ షెల్టర్‌లో ఉచిత వసతి,స్నానాలు, టాయిలెట్లు,తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

రోగులతో వచ్చే బంధువులు బయట ఇబ్బందులు పడకుండా ఈ వసతి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి,డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ.అప్పయ్య,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు



హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:
హుజురాబాద్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
ఎస్సారెస్పీ కెనాల్‌లో నీటి ప్రవాహం లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి కెనాల్‌లో నింపడంతో పాటు ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేస్తున్నారు.
సుమారు 150కు పైగా విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా, భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ తెలిపారు.

# భూ రికార్డులకు భూదార్ రక్షణ కవచం

● జాయింట్ కలెక్టర్ ఎన్ రవి



హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో భూదార్ సర్వేపై మంగళవారం సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ ఎన్. రవి హాజరయ్యారు. భూదార్ సర్వేతో భూముల సరిహద్దులు,విస్తీర్ణం శాశ్వతంగా డిజిటల్ రికార్డుల్లో నమోదవు తాయని ఆయన తెలిపారు. ఉపగ్రహ ఆధారిత జీపీఎస్, జియో కోఆర్డినేట్స్ సాంకేతికతతో కచ్చితమైన సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు.రైతులు తమ వాస్తవ భూమి వివరాలను అధికారులకు చూపించి సర్వే బృందాలకు సహకరించాలని సూచించారు.తప్పుడు వివరాలు ఇస్తే భవిష్యత్‌లో వివాదాలు,క్రిమినల్ కేసులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి భూ విభాగానికి ల్యాండ్ పార్సెల్ మ్యాప్ (ఎల్‌పీఎం) రూపొందించి, భూమికి భూదార్ నంబర్ కేటాయించే విధానం ఉంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమ ంలో మండల రెవెన్యూ అధికారి పూజారి కిరణ్ కుమార్,ఆర్ఐ రాజేంద్రప్రసాద్,జిపిఓ వనిత, ఉప సర్పంచ్ అరుణ్, అధికారులు,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎం గేటు వద్ద ఉద్రిక్తత



హనుమకొండ,జోర్దార్ ప్రతినిది:ఎంజీఎం ఆసుపత్రిలో పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనల నేపథ్యంలో ఆసుపత్రిని పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో ఎంజీఎం ప్రధాన గేటు వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.
ఆదివారం ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో కొందరు రోగులు గాయపడినట్లు సమాచారం. మంగళవారం ఆర్ఐసీయూ వార్డులోనూ ఇదే తరహా ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఘటనలపై పూర్తి వివరాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తనను అడ్డుకోవడం సరికాదని వినయ్ భాస్కర్ పేర్కొంటూ, రోగుల భద్రతపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా,తనకు గాయాలు కావడంతో ఎంజీఎం లోనే చికిత్స అందించాలని కోరినప్పటికీ పోలీసులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

# అభ్యసన సామర్థ్యాల సాధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:పాఠశాలల్లో నిర్వహించే ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల ప్రశ్నపత్రాలు పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్--2024 నివేదికలోని సూచనలకు అనుగుణంగా ఉండాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి సూచించారు. విద్యార్థులు నెలవారీగా సాధించాల్సిన అభ్యసన సామర్థ్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.
హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండో ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు నిర్దేశించిన అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో విధిగా ఇంగ్లిష్‌లో మాట్లాడాలని, తద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై అవగాహనతో పాటు మాట్లాడే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు.మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి నిర్దేశించిన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన విద్యా సహకారం అందించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ దేవారం శోభారాణి, ఆర్పీలుగా పత్తేం శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, తంగేళ్లపల్లి శ్రీనివాస్ వ్యవహరించారు. హుజురాబాద్ మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు





(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)జమ్మికుంటలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల నందు పర్యాటక రంగంలో యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.రమేష్ మాట్లాడుతూ అన్ని కోర్సుల విద్యార్థులకు పర్యాటక రంగం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త డాక్టర్ గుజ్జేటి తిరుపతి సహాయ ఆచార్యులు కేంద్రీయ విశ్వవిద్యాలయం, కేరళ విస్తృత ఉపన్యాసం చేశారు. డాక్టర్ గుజ్జేటి తిరుపతి మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలు మాల్దీవులు, సెయింట్ లుకాస్, శ్రీలం క, గల్ఫ్ దేశాలు, పర్యాటక రంగంపై ఆధార పడి తమ జాతీయ ఆదాయంలో 70% శాతం వరకు పర్యాటక రంగం నుండి పొందుతు న్నాయి అని తెలిపారు. భారతదేశంలో మరియు తెలంగాణలో పర్యాటక రంగం ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా దాదాపు 14 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. భార తదేశ జాతీయోత్పత్తిలో 5% శాతం వాట పర్యాటక రంగం నుండి వస్తుందన్నారు. కావున పర్యాటక రంగానికి పెరుగుతున్న ప్రాముఖ్యత దృష్ట్య విద్యార్థులు, యువత పర్యాటక రంగా లలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి పి. శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డా. కె. రాజేంద్రం, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డా. కె. గణేష్, డా. శామల, కె.ఉమాకిరణ్, కిరణ్ కుమార్, డా. కె. మాధవి, డా. సి రాజ కుమార్, డా. ఇ.రవి, ఎల్. రవిందర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మగడ్డలో అర్బన్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన



హనుమకొండ,జోర్దార్ ప్రతినిది:వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పెద్దమ్మగడ్డ కాలనీలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మగడ్డ ప్రాంతం గతంలో అభివృద్ధికి దూరంగా ఉండేదని, ప్రస్తుతం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
స్థానిక ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పా రు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య,అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలకు

## సహాయక ఉపకరణాల కోసం నిర్ధారణ శిబిరం



హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:సమగ్ర శిక్ష, కరీంనగర్, వాల్మీకో ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సహాయక ఉపకరణాలు అందించేందుకు హుజురాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్ధారణ శిబిరం నిర్వహించారు.హుజురాబాద్, సైదాపూర్, కేశవపట్నం, వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలకు చెందిన 18 ఏళ్లలోపు 130 మందికి పైగా దివ్యాంగ చిన్నారులు శిబిరానికి హాజరయ్యారు. వారి దివ్యాంగత పరిస్థితి, అవసరాలను పరిశీలించి వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వాకింగ్ ఎయిడ్స్ తదితర సహాయక ఉపకరణాల కోసం నిర్ధారణ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ దాసరి శ్రీనివాస్, క్వాలిటీ కో-ఆర్డినేటర్ కర్ర అశోక్‌రెడ్డి, మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు తిరుపతమ్మ, ప్రత్యేక విద్యా బోధకులు, ఐఈఆర్పీలు, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నాం



జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:రైతులు అధైర్యపడొద్దని, సాగునీటి విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వర్షాభావంతో డ్యాముల్లోకి నీటి చేరిక తక్కువగా ఉందన్నారు.తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూనే అదనంగా లభించే నీటిని రైతులకు ఒకటి, రెండు తడుల కోసం అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తుంగభద్ర జలాల్లో మూడు టీఎంసీలను విడతల వారీగా, జూరాల ఆయకట్టుకు అదనంగా ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సంపత్‌కుమార్ పేర్కొన్నారు.

# పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



వరంగల్ ,జోర్దార్ ప్రతినిధి:పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి యూత్ ఫర్ సేవ చేస్తున్న సేవలు అభినందనీయమని ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయులు అనంతల సురేష్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అనంతల సురేష్ యూత్ ఫర్ సేవకు కృతజ్ఞతలు తెలిపారు. యూత్ ఫర్ సేవ వరంగల్ కోఆర్డినేటర్ మేకల రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు, అభ్యున్నతి కోసం సంస్థ ఆధ్వర్యంలో పలు విద్యా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. రమాదేవి, రాజశేఖర్, ఎం. భాస్కర్, జితేందర్‌రెడ్డి, అశోక్, యూత్ ఫర్ సేవ కోఆర్డినేటర్ జక్కుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

● మండపాల నిర్వాహకులకు అధికారుల సూచనలు



హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణంలో బుధవారం జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని మనోజ్‌రావు సూచించారు. మంగళవారం సిటీ సెంట్రల్ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో అవగాహన సమావేశం నిర్వహించారు.నిమజ్జనం సందర్భంగా డీజేలు, బాణాసంచా వినియోగించరాదని, మత్తు పానీయాలు సేవించవద్దని, పోలీసు అధికారులు, నిమజ్జన కమిటీ సూచనలను పాటించాలని ఏసీపీ మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ కిషన్ తెలిపారు. నిమజ్జనం సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు, ప్రజాప్రతినిధులకు లేదా నిమజ్జన కమిటీకి సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి,ఏఈ శ్రీనివాస్, నిమజ్జన కమిటీ గౌరవ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు బుర్ర నటరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాస్ గోపాలరావు, సలహాదారులు గుంటి శ్రీనివాస్, కన్నన్ దురైరాజ్, మంచి కట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి నీటి కొరత లేకుండా చూడాలి

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి



హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణ, మండల పరిధిలో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అధికారులను కోరారు. నిమజ్జన వేదికల వద్ద నీటి కొరత ఉన్న విషయంపై మంగళవారం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, కెనాల్ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఎమ్మెల్యే విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, నిమజ్జనం సజావుగా జరిగేందుకు అవసరమైన మేర నీటిని కెనాల్ ద్వారా విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు.
ఉత్సవ కమిటీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పాత కక్షలతో గొడవ

## నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:పాత కక్షల నేపథ్యంలో గొడవకు పాల్పడిన వ్యక్తిని టేకుమట్ల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ జి. అమూల్య తెలిపారు. టేకుమట్ల మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన జక్కుల రవి, గంధం లావణ్య వద్ద రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు.
అప్పు చెల్లించకపోవడంతో లావణ్య తమ్ముడు జక్కుల కుమార్ పెద్దమనుషుల సమక్షంలో రవిని పిలిపించి మాట్లాడగా, డబ్బులు చెల్లించడంతో అప్పు వ్యవహారం పరిష్కారమైనట్లు పేర్కొన్నారు.
అనంతరం జక్కుల రవి, జక్కుల కుమార్ కుటుంబ సభ్యులను దూషించగా, జక్కుల రాజయ్య ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించి నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో రవి రాజయ్యను నెట్టివేయడంతో ఆయన కాలు విరిగినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు జక్కుల రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.
చిన్నచిన్న విషయాలకు గొడవలకు దిగుతూ ఆవేశంతో తిట్టుకోవడం, కొట్టుకోవడం వల్ల కేసులపాలై జీవితాలను ఇబ్బందులకు గురిచేసుకోవద్దని ఎస్ఐ అమూల్య సూచించారు. సమస్యలు తలెత్తినప్పుడు చట్టపరంగా పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:అయిజ:** అయిజ మండలం దేవబండ గ్రామ శివారులోని భారత్‌మాల జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

గట్టు మండలం తప్పట్ల మొరుసు గ్రామానికి చెందిన బీసన్న గౌడ్ (35) ప్రయాణిస్తున్న వాహనం రహదారి మరమ్మతుల పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెంది నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద



**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)** వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయడమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే నిమజ్జన ఏర్పాట్లకు అధికారులను షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించడం జరిగిందని, చిన్న వడ్డేపల్లి, కట్ట మల్లన్న చెరువు,గోర్రెకుంట, అగర్తల చెరువు, ఉర్సుగుట్ట, బెస్తం చెరువు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. అలాగే మదన్నపేట నర్సంపేట, దుగ్గొండి చెరువు, పాకాల చెరువు, కొల్లకుల చెరువు చెన్నరావుపేట, గురిజాల పెద్ద చెరువు, నల్లబెల్లి పెద్ద చెరువు, రంగాయి చెరువు, నెక్కొండ చెరువు, చంద్రుగొండ కుంట, కోనారెడ్డి ట్యాంక్ తదితర ప్రాంతాల్లోనూ అధికారులు విధులు నిర్వహించనున్నారు.

నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లు, పడవలు, 108 అత్యవసర సేవలు, వైద్య బృందాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో క్రేన్లు, ఆపరేటర్లు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, సివిల్ డిఫెన్స్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు.అన్ని నిమజ్జన కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, డీజిల్, నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు తమకు కేటాయించిన సమయాల్లో తప్పనిసరిగా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు మొత్తం నిమ జ్జన ఏర్పాట్లకు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తూ అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమ న్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు.

# వరంగల్ విమానాశ్రమానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు ప్రకటించాలి

- అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి విజయ్ కుమార్ డిమాండ్



**(నర్సంపేట జోర్దార్ ప్రతినిధి)**నర్సంపేట పట్టణంలోని అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఒక పత్రిక ప్రకటన ద్వారా అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు వరంగల్ జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ మెంబర్ పాలకుర్తి విజయ్ కుమార్ మాట్లాడుతూ చరిత్రత్మకమైన వరంగల్ జిల్లాలో త్వరలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి భారత రాజ్యాంగం నిర్మాత భారతరత్న ప్రపంచ మేధావి చిన్న రాష్ట్రాల ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు నామకరణం చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌరవ ఏ రేవంత్ రెడ్డి గారికి అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ తరపున మనవి చేయుచున్నాము డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోని రెండవ పెద్ద నగరం అయిన వరంగల్ జిల్లా పూర్వకాలంలో కాకతీయుల రాష్ట్ర రాజధానిగా పేరు ప్రతిష్టలు పొందినది ప్రపంచంలో విద్యావేత్తగా విశ్వ విజ్ఞానిగా భారత రాజ్యాంగ రూపశిల్పిగా ప్రపంచ స్థాయిలో పేరు ప్రతిష్టలు పొందిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క పేరును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ శ్రీ ఏ రేవంత్ రెడ్డి గారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరును పరిశోధన చేసి వరంగల్ విమానాశ్రయానికి పేరు ప్రకటించాలి అని పాలకుర్తి విజయ్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతూ ప్రపంచస్థాయి పర్యటకులను ఆకర్షించే విధంగా రూపుదిద్దుకుంటున్న వరంగల్ లోని మామునూరులో నిర్మిస్తున్న విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది వరంగల్ లో నిర్మించే విమానాశ్రయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించి అంబేద్కర్ గారి యొక్క జీవిత చరిత్రను తను రాసిన పుస్తకాలను పరిశోధనలను ఒక లైబ్రరీ ఏర్పాటు చేసి విమాన ప్రయాణికులు ఉపయోగించుకునే విధంగా తగిన ఏర్పాటు చేయాలి అందుకోసం కొన్ని నిధులను అధికంగా కేటాయించాలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క విశిష్టతను తన గొప్పతనం ప్రపంచస్థాయిలో తెలియజేయాలని కోరుతూ అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తి పొందిన ప్రతి పౌరుడు వరంగల్ విమానాశ్రయానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు ప్రకటించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం ద్వారా అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

# గణపతి నవరాత్రుల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ



- దాతల సహకారంతో అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**(ఇల్లందకుంట జోర్దార్ ప్రతినిధి)** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఇల్లందకుంటలోని అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో మంగళవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతల సహాయ సహకారాలతో భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.

ఈ సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాలకు హాజరైన భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సేవా కార్యక్రమంలో కమిటీ సభ్యులు, దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భక్తులకు అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక సేవను కొనసాగిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# రత్నాపూర్‌లో నూతన పెన్షన్ల విచారణ





**రామగిరిజోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో నూతన పెన్షన్లకు సంబంధించిన విచారణ మంగళవారం కొనసాగింది. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు ఎంపీఓ మోతె సమ్మిరెడ్డి వెళ్లి వారి వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించారు. గ్రామంలో మొత్తం 72 మంది నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియను స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ--పీవీరావు పరిశీలించారు.

**గేదె దాడిలో గాయపడిన వ్యక్తికి పరామర్శ**

అనంతరం సోమవారం గేదె దాడిలో తీవ్రంగా గాయపడిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి భర్త సందవేన కుమార్‌ను సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ బాద్రపు ప్రవలిక--ప్రశాంత్, వార్డు సభ్యురాలు పబ్బ స్రవంతి--వెంకటేష్, పంచాయతీ కార్యద ర్శి గంగుల సంతోష్, స్థానిక నాయకులు పబ్బ మొగిలి, ఇజ్జగిరి సంపత్, అబ్బ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ నేత దాసరి శివకు పరామర్శ

**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండలం బేగంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసరి శివ జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్లే రామమూర్తి, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు ఎరుకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



# ఓటు కోసం ఆధారాల వేట.. ఎస్ఐఆర్‌తో ఓటర్ల అవస్థలు!

- 2002 జాబితా కోసం పరుగులు.. రకరకాల నోటీసులతో గందరగోళం
- వృద్ధులు, నిరక్షరాస్యులకు తిప్పలు.. బీఎల్ఓలు, జీపీవోలపై రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలు
- ఊర్లో లేనివారికీ ఓటు దరఖాస్తుల కోసం ఒత్తిడా?

**హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:**ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పలువురు ఓటర్లకు, మరోవైపు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, జీపీవోలు, అధికారులకు తలనొప్పిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు పాత ఓటరు జాబితా వివరాలు, కుటుంబ సంబంధాలు, వివిధ ధ్రువపత్రాలు సమర్పించాలంటూ నోటీసులు రావడంతో ఓటర్లు అయోమయానికి గురవుతుండగా.. మరోవైపు నిబంధనల ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తే కొందరి నుంచి రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు.




**2002 జాబితా.. ఓటర్లకు కొత్త తిప్పలు!**

ఎస్ఐఆర్ ప్రక్రియలో 2002 నాటి ఓటరు జాబితా వివరాలతో ప్రస్తుత ఓటర్ల వివరాలను అనుసంధానం చేయాలని సూచిస్తున్నట్లు ఓటర్లు చెబుతున్నారు. అప్పటి జాబితాలో తమ కుటుంబ సభ్యుల వివరాలను గుర్తించి ప్రస్తుత జాబితాకు జత చేయాలని కోరుతున్నారని పేర్కొంటున్నారు.అయితే రెండు దశాబ్దాల క్రితం నాటి ఓటరు జాబితా వివరాలు అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రుల వివరాలు, వయస్సు వ్యత్యాసాలు, కుటుంబ సంబంధిత ఆధారాలు, కుల ధ్రువపత్రం తదితర పత్రాలను సమర్పించాలని కోరుతున్నారని చెబుతున్నారు.

**వృద్ధులకు.. వివరాల పరీక్ష!**

వయసు మీదపడిన ఓటర్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. తల్లిదండ్రులు, ముత్తాతలు ఎప్పుడో మృతి చెందడంతో వారి వివరాలు అందుబాటులో లేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. చిన్నతనంలోనే వివాహాలు జరిగిన మహిళలకు పాత కుటుంబ వివరాలు సేకరించడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."జన్మించినప్పటి నుంచి ఇదే గ్రామంలో ఉంటున్నాం.. ఇన్నేళ్లుగా ఓటు వేస్తున్నాం. ఇప్పుడు మా ఓటు కోసం ఇన్ని ఆధారాలు ఎక్కడి నుంచి తీసుకురావాలి?" అంటూ వృద్ధ ఓటర్లు ప్రశ్నిస్తున్నారు.

**ఒకసారి దరఖాస్తు.. మళ్లీ మళ్లీ పరుగులు!**

దరఖాస్తు సమర్పించిన తర్వాత కూడా అది పూర్తయిందా లేదా తెలుసుకునేందుకు పలుమార్లు బీఎల్ఓలను కలవాల్సి వస్తోందని ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఒకసారి ఒక పత్రం లేదని, మరోసారి మరో ఆధారం కావాలని చెబుతుండటంతో పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులకు ఆన్‌లైన్ ప్రక్రియ, దరఖాస్తుల విధానం అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. వారికి ఓపికగా వివరించి దరఖాస్తు పూర్తయ్యే వరకు సహకరించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**బీఎల్ఓలపై రాజకీయ ఒత్తిళ్లా?**

ఓటర్ల ఇబ్బందులతో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలు, జీపీవోలు కూడా రాజకీయ ఒత్తిళ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా నివాసం లేని వారు ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే ఓటు నమోదు చేసుకోవాలని మండలస్థాయి అధికారులు, ప్రత్యేకాధికారులు సూచిస్తున్నప్పటికీ.. కొందరు రాజకీయ నాయకులు మాత్రం తమకు నచ్చిన వ్యక్తుల దరఖాస్తులు తీసుకోవాలని సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.స్థానికంగా నివాసం లేని వ్యక్తులు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించాలని ఒత్తిడి వస్తోందని కొందరు బీఎల్ఓలు, జీపీవోలు వాపోతున్నట్లు సమాచారం. ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాల్సిన నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించాల్సి వస్తే భవిష్యత్‌లో బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నిస్తున్నారు.

**డబుల్ ఓట్లపై హెచ్చరికలు.. అయినా ఒత్తిళ్లేనా?**

ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకోవడం చట్టపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉందని అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ, నిబంధనలను పక్కనపెట్టి దరఖాస్తులు తీసుకోవాలని ఒత్తిడి చేయడం ఏమిటని సిబ్బంది ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. "నిబంధనల ప్రకారం అర్హత లేని దరఖాస్తును తీసుకోకపోతే ఒత్తిళ్లు.. తీసుకుంటే భవిష్యత్‌లో అధికారులపైనే బాధ్యత. మరి మేమేం చేయాలి?" అంటూ క్షేత్రస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**బీఎల్ఓలకే పూర్తి అవగాహన ఉందా?**

ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఓలకు ముందస్తుగా పూర్తిస్థాయి శిక్షణ, స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఓటర్లు అడిగే కొన్ని సందేహాలకు సిబ్బంది నుంచి కూడా స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో గందరగోళం మరింత పెరుగుతోందని గ్రామస్తులు చెబుతున్నారు.ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు బీఎల్ఓలు, జీపీవోలు, అధికారులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

**ఓట్లు అడిగిన నాయకులు.. ఇప్పుడు ఎక్కడ?**

ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగే రాజకీయ నాయకులు.. ఇప్పుడు ఎస్ఐఆర్ నోటీసులతో వృద్ధులు, నిరక్షరాస్యులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎందుకు అందుబాటులోకి రావడం లేదని గ్రామస్తులు నిలదీస్తున్నారు."ఎన్నికలప్పుడు మా ఓటు కోసం ఇంటికి వస్తారు.. ఇప్పుడు మా ఓటు సమస్య వస్తే పట్టించుకునేవారు లేరు. ఓటు మాత్రమే కావాలా..
మా సమస్యలు అవసరం లేదా?" అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు స్పష్టం చేయాలి

అర్హులైన ఒక్క ఓటరు కూడా అనవసర ప్రక్రియ కారణంగా ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వృద్ధులు, నిరక్షరాస్యులు, తల్లిదండ్రుల వివరాలు అందుబాటులో లేని వారికి ఏ విధమైన ప్రత్యామ్నాయ ఆధారాలు సమర్పించవచ్చో స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు.అదేవిధంగా స్థానికంగా నివాసం లేని వ్యక్తుల దరఖాస్తుల విషయంలోనూ స్పష్టమైన నిబంధనలు పాటించాలని, బీఎల్ఓలు, జీపీవోలపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చూడాలని కోరుతున్నారు.
ఓటు హక్కును కాపాడే ప్రక్రియే.. ఓటర్లకు, అధికారులకు కొత్త సమస్యగా మారకూడదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# రాజాపూర్ ఓసీపీ-2పై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

- గ్రామపంచాయతీ నుంచి టీఆర్ నంబర్లు ఉన్నా పరిహారంలో అన్యాయం
- పాత ఇళ్లను 'ఖాళీ స్థలాలు'గా ఎలా చూపారు? అని ఆవేదన వ్యక్తం చేసిన గ్రామస్తులు
- పరిహారం, పునరావాసంపై భూనిర్వాసితులు నెంబర్ వేసిన ప్రతి ఆర్‌పీఎన్, ఆర్‌టీహెచ్ ఇళ్లకు సమాన నష్టపరిహారం ఇవ్వాలని వినతి



**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**ఆర్జీ--3 పరిధిలోని ఓసీపీ--2 విస్తరణతో ముంపునకు గురికానున్న రాజాపూర్ గ్రామంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం పర్యటించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఆయన.. భూములు, ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూనిర్వాసితులు తమ ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూములు, ఇళ్లకు సంబంధించిన పరిహారం విషయంలో తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా ఆర్‌పీఎన్, ఆర్‌టీహెచ్ ఇళ్లకు సమాన ప్రాతిపదికన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన భూమి, ఇల్లు, పరిహారం వివరాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అర్హత, పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైతే అధికారులను మరోసారి గ్రామానికి పంపించి క్షేత్రస్థాయిలో సర్వే చేయిస్తామని, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**న్యాయం జరిగే వరకు ఇల్లు ఖాళీ చేయం**

తగిన పరిహారం, పునరావాసం కల్పించే వరకు ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు స్పష్టం చేశారు. ముంపు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే ముందు ప్రతి కుటుంబానికి న్యాయమైన పరిహారం, పునరావాస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కలెక్టర్ పర్యటనలో మంథని ఆర్డీఓ సురేష్, రామగిరి తహసీల్దార్ సుమన్, సింగరేణి జీఎం మధుసూదన్, ఎస్టేట్ ఆఫీసర్ ఐలయ్య, ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ స్వామి, రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్, ముత్తారం ఎస్సై రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లెల సతీష్, వార్డు సభ్యులు కాల్వ రజిత శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుల్లెల కిరణ్‌తో పాటు గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, భూనిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

# నవాబ్‌పేట బావిలో మృతదేహం సార్ల సాగర్‌గా గుర్తింపు

- రామగిరి మండలం నవాబ్‌పేట జాతీయ రహదారి వద్ద ఘటన



**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**రామగిరి మండలం నవాబ్‌పేట జాతీయ రహదారి సమీపంలోని బావిలో లభ్యమైన మృతదేహాన్ని సార్ల సాగర్‌గా పోలీసులు గుర్తించారు. మృతదేహంతో పాటు సుమారు 150 మీటర్ల కేబుల్ కూడా లభ్యమైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న రామగిరి ఎస్సై టి. శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీయించారు. అనంతరం ఘటనపై దర్యాప్తు చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే చర్యలు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# సంస్కృతి అపార్ట్మెంట్ మట్టి గణపతి విగ్రహ దాతకి సన్మానం



**హన్మకొండజోర్దార్ ప్రతినిధి:**ట్రై సిటి అపార్ట్మెంట్ అసోసియేషన్ హన్మకొండ వారి సౌజన్యం తో పర్యావరణ రక్షణ భాగంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించేందుకు మట్టి విగ్రహాలను పెట్టిన జిల్లాలోని అపార్ట్మెంట్లను సందర్శించి విగ్రహ దాతకు మెమెంటో శాలువాతో సత్కరించారు. సంస్కృతి అపార్ట్మెంట్లో విగ్రహాదాత గందె మమత రమేష్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైసిటీ అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవ రెడ్డి కోశాధికారి రాజకుమార్, జాయింట్ సెక్రెటరీ సత్యానారాయణ, ఆర్గనైజర్ సెక్రెటరీ, అంజలి దేవి , మా సంస్కృతి అపార్ట్మెంట్ అధ్యక్షుడు చిట్టి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి సుంక్షాల తిరుపతి రావు, సంస్కృతి గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, సలహాదారు మంచాల రమేష్ , జాయింట్ సెక్రెటరీ ప్రసన్న, ఉపాధ్యక్షుడు గోవర్ధనం వెంకటాచారి, వెలవెందుల భాస్కర్ లింగం, మరియు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. అనంతరం డిస్టిక్ అపార్ట్మెంట్ డైరీలను సంస్కృతి అపార్ట్మెంట్ వారికి అందజేసినారు.

# మాదిగ ఉద్యోగుల జోలికి వస్తే సహించేదిలేదు



**జోర్దార్ ప్రతినిధి కేయూ :**మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ ఎల్ పి రాజ్ కుమార్ మరియు కాంట్రాక్ట్ అధ్యాపకులు డా. మంథని శంకర్ పై అసత్య కథనాలు ప్రచారం చేస్తున స్పాట్ వాయిస్ ఆన్లైన్ పత్రికపైన మరియు స్పాట్ వాయిస్ ఆన్లైన్ పత్రిక కు అడ్డు పెట్టుకొని మాదిగ సామాజిక వర్గం పట్ల కక్ష సాధింపు కు పాల్పడుతున్న ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ గార్ల కి వినతి పత్రం అందజేయడం చేయడం జరిగింది

కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు, మాదిగ జాతి విద్యార్థులుగా మాట్లాడుతూ ప్రొఫెసర్ ఎల్ పి రాజ్ కుమార్ మరియు కాంట్రాక్ట్ అధ్యాపకులు డా. మంథని శంకర్ ల పై స్పాట్ వాయిస్ ఆన్లైన్ పత్రికను అడ్డు పెట్టుకొని మాదిగ సామాజిక వర్గం పట్ల కక్ష సాధింపు కు పాల్పడుతున్న ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి.

ఒక బాధ్యతయుతమైన పదవిలో కొనసాగుతూ ఈలాంటి పనులు చేయడం ముమ్మాటికి యూనివర్సిటీ ఉన్నతిని అభాసు పాలుచేయడమేనని తెలియజేస్తున్నము. మరో ముఖ్య విషయం ఏమిటంటే ప్రొఫెసర్ రాజ్ కుమార్ మరియు కాంట్రాక్ట్ అధ్యాపకులు డా. మంథని శంకర్ ల పై యూనివర్సిటీ రిజిస్ట్రార్ నియమించిన కమిటీలో మెంబర్ ఉండి ఆ కమిటీలోని ప్రతి విషయాన్ని స్పాట్ వాయిస్ ఆన్లైన్ పత్రిక లో ప్రచారం చేస్తూ మాదిగ జాతి పైన తన అక్కసును చూపిస్తున్నాడు. ఈ ఇస్తారి పైన గతంలో మాదిగ జాతి పరిశోధక విద్యార్థిని వేధించినదుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు అయ్యి జైలుకు వెళ్ళాడు అనే విషయం యూనివర్సిటీ పాలన అధికారులకు తెలియందికాదు.

అలాంటి ప్రో. ఇస్తారీను మాదిగ జాతి అధ్యాపకులు కమిటీలో మెంబర్ నియమించడం ఎంతవరకు సమంజసమో ఒక్కసారి పునరాలోచించాలని కోరుతున్నాం. మాదిగ జాతి పరిశోధక విద్యార్థిలుగా, విద్యార్థి ని విద్యార్థులుగా మరియు విద్యార్థి సంఘాల పక్షాన కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మరియు రిజిస్ట్రార్ సార్లు తక్షణమే మాదిగ జాతి అధ్యాపకులను కల్పిత వార్తలు రాస్తున్న స్పాట్ వాయిస్ ఆన్లైన్ పత్రికపైన మరియు ఈ వార్తలకు పరోక్షంగా సహకరిస్తున్న ప్రొఫెసర్స్ మామిడాల ఇస్తారి పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో మంద భాస్కర్ మాదిగ, మంద నరేష్, బోట్ల మనోహర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు .

# ప్రేగు క్యాన్సర్‌తో బాధపడుతున్న నిరుపేద బాలికకు మార్నింగ్ ఫ్రెండ్స్ అండ



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:**తీవ్రమైన ప్రేగు క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద బాలికకు హుజురాబాద్ పట్టణానికి చెందిన మార్నింగ్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు అండగా నిలిచారు. తమ వంతు సామాజిక బాధ్యతగా రూ.20,500 ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన మైస శరణ్య కొంతకాలంగా ప్రేగు క్యాన్సర్‌తో బాధపడుతోంది. కుటుంబం అత్యంత నిరుపేద స్థితిలో ఉండటంతో చికిత్స అందించడం తల్లిదండ్రులకు భారంగా మారింది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి వెళ్లేందుకు కనీస రవాణా ఖర్చులు కూడా లేక కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని కాట్రపల్లి మాజీ సర్పంచ్ కాసగోని కిరణ్ కుమార్ మార్నింగ్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. బాలిక పరిస్థితిని తెలుసుకున్న సభ్యులు వెంటనే స్పందించి విరాళాలు సేకరించారు. కౌన్సిలర్ వర్జినల్ రవీందర్ రావు రూ.5,000, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ రూ.2,000, మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్ రూ.1,000, పాక సతీష్ రూ.1,000, ధనుర్ష రాజు రూ.1,000, చంద్రగిరి ప్రవీణ్ రూ.500 తదితరుల సహకారంతో మొత్తం రూ.20,500 సమకూర్చి బాలిక కుటుంబానికి అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కాసగోని కిరణ్ కుమార్ మాట్లాడుతూ శరణ్య క్యాన్సర్ చికిత్సకు భారీగా ఖర్చవుతోందని, నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల భారాన్ని భరించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, దాతలు, పెద్దమనసున్నవారు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

సహాయం చేయదలచిన దాతలు **9866907717** నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే లేదా నగదు ద్వారా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ధర్మపురిలో ఘనంగా భాగవత సప్తాహం



- ఐదో రోజు ఆకట్టుకున్న ఆచార్య కశోజ్జల నీలకంఠం భాగవత ప్రవచనం

**ధర్మపురి జోర్దార్ ప్రతినిధి:**ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, శారదా మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ కార్యక్రమం ఐదో రోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు బ్రాహ్మణోత్తములు, భక్తులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ పౌరాణికులు, సంస్కృత--తెలుగు పండితులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత విభాగం ప్రొఫెసర్‌గా, సంస్కృత అకాడమీ డైరెక్టర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన ఆచార్య కశోజ్జల నీలకంఠం భాగవత ప్రవచనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తన కంచు కంఠంతో పద్యాలు, శ్లోకాలు, వాటి భావార్థాలు, వ్యాఖ్యానాలను వివరిస్తూ శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. భాగవతాన్ని అనేక మంది ప్రవచిస్తారని, అయితే ఆచార్య నీలకంఠానికి సంస్కృతం, కావ్యం, నాటకం, వ్యాకరణం, పురాణం, అలంకార శాస్త్రాలపై ఉన్న లోతైన పాండిత్యం ఆయన ప్రవచనంలో స్పష్టంగా కనిపించిందని పలువురు పేర్కొన్నారు. మహామహోపాధ్యాయ పుల్లెల శ్రీరామచంద్రుడు, పీవీ కాణే, ఆచార్య బూర్గడ్డ నరసింహాచార్యులు వంటి ప్రముఖుల వద్ద విద్యాభ్యాసం చేసిన ఆయన.. ధర్మపురి, వేములవాడ వంటి పుణ్యక్షేత్రాల పాండిత్య సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని కొనియాడారు. అనేక మంది ఎంఫిల్, పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన ఆచార్య నీలకంఠం.. వారి పరిశోధనా సిద్ధాంత వ్యాసాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అవసరమైన మార్పులు, చేర్పులు సూచిస్తుంటారని తెలిపారు. ఇలాంటి విశాలమైన పాండిత్యంతో ధర్మపురి వంటి పండితుల క్షేత్రంలో భాగవత ప్రవచనం చేయడం ప్రత్యేకతగా భక్తులు అభివర్ణించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుండి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ.. "విద్యావతాం భాగవతే పరీక్ష" అన్న నానుడికి అనుగుణంగా ధర్మపురి వంటి పుణ్యక్షేత్రంలో భాగవతాన్ని వివరించడం సామాన్య విషయం కాదన్నారు.

ముఖ్యంగా ఏకాదశి రోజున భాగవతాన్ని వినే అవకాశం లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

గురువు ఆచార్య కశోజ్జల నీలకంఠం ఆశీస్సులు పొందడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించి ందని తెలిపారు.

# క్రీడల్లో కాళేశ్వరం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల సత్తా జిల్లా స్థాయి పోటీలకు 10 మంది ఎంపిక



**కాళేశ్వరం జోర్దార్ ప్రతినిధి:**జడ్పీహెచ్‌ఎస్ కాళేశ్వరం పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్--14, అండర్--17 వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొనికాల రాజేందర్ అభినందించారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందిస్తూ వారి ప్రతిభను వెలికితీస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు జంగపల్లి సమ్మయ్యను ఉపాధ్యాయ బృందం అభినందించింది. జిల్లా స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించారు.

# జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- 24, 25 తేదీల్లో దోస్త్ ద్వారా ప్రవేశాలు.. ఇదే చివరి అవకాశం




**(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)**జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ తెలిపారు.

దోస్త్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని, డిగ్రీలో చేరేందుకు ఇదే చివరి అవకాశమన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు.

విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. కళాశాలలో బీకాం (రిటైల్ ఆపరేషన్)తో పాటు బీఏ, బీకాం, బీఎస్సీలో ఉపాధి ఆధారిత కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, శుద్ధి చేసిన తాగునీటి సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు.

గత విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులు ఉద్యోగాలు, మరో 40 మంది ఉద్యోగ శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. మరో 10 మంది కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీజీ సీట్లు సాధించారని చెప్పారు.

దాతల సహకారంతో విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY
తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# బతుకు పోరు...!



మెతుకు కోసం బతుకు పోరాటం ...
మూట కోసం మోకాళ్లపై నడిచే బతుకు...
గూడు కోసం గుండెను గుల్ల చేసే బతుకు...
గుప్పెడు గంజికై గాయపడే బతుకు...!

కన్నీటి కడలిలో
కలల పడవలు...
కష్టాల కొలిమిలో
కాలుతున్న జీవితాలు...!

ఒకడికి ఆకాశమంత ఆస్తి...
ఒకడికి అర్ధపూట అన్నమే అస్తి...
ఒకడికి అధికారపు అహంకారం...
ఒకడికి ఆకలే నిత్య నరకం...!

ఇదేనా సమాజం?
ఇదేనా సమానత్వం?
ఇదేనా నాగరికత?
ఇదేనా మానవత్వం?

రంగుల మయం జీవితం కాదు...
మాట ఒకటి... మది మరొకటి...
ముఖం ఒకటి... మనసు మరొకటి...!

నవ్వుల వెనుక నిశ్శబ్ద రోదనలు...
వెలుగుల వెనుక వెన్నెల లేని రాత్రులు...
ఆర్భాటాల వెనుక ఆరిపోయిన ఆశలు...!

జీవితం ఒక రంగుల రాట్నం...
తిరుగుతూనే ఉంటుంది కాలచక్రం...
ఎవరి వంతు ఎప్పుడు వస్తుందో తెలియదు...
ఎవరి వంతు ఎప్పుడు పోతుందో తెలియదు...!

ధనం దర్పమై...బలం గర్వమై...
అధికారం అహంకారమై...
అన్యాయం ఆనవాయితీ అయింది...!

బీదవాడి బతుకు బరువైంది...
బలహీనుడి గొంతు మూగైంది...
న్యాయం నడక నెమ్మదైంది...
నిజం నడుమనే నలిగిపోయింది...!

చదువుకున్నాం... కానీ చైతన్యం మరిచాం...
పుస్తకాలు చదివాం... కానీ మనిషిని చదవలేదు...

డిగ్రీలు తెచ్చాం... కానీ దయను తెచ్చుకోలేదు...
విజ్ఞానం పెంచాం... కానీ వివేకం పెంచలేదు...!

సమానత్వం....
అందని ఆకాశమా?
సామరస్యం...
అందని స్వప్నమా?
మానవత్వం....
మాటల్లో మాత్రమే మిగిలిన మంత్రమా?

చావు బతుకుల మధ్య
చలించని హృదయాలెందుకు?
కన్నీటి కడలిమధ్య
కనిపించని కనికరమెందుకు?
మనిషి పక్కనే మనిషి ఉంటూ
మనసుకు మాత్రం మనిషి దూరమెందుకు?

ప్రశ్నించు మనసా... ప్రశ్నించు!
ప్రతిఘటించు గుండె... ప్రతిఘటించు!
అన్యాయాన్ని అంగీకరించకు...
అవమానాన్ని అలవాటుగా చేసుకోకు...!

పడిపోతే లేచి నిలువు...
ఓడిపోతే మళ్లీ నడువు...
దారి మూసితే దారిని వెతుకు...
దారే లేకుంటే దారిని సృష్టించు...

బతకడం అంటే ఊపిరి పీల్చడం కాదు...
బాధల మధ్య భవిష్యత్తును నిర్మించడం!
బతకడం అంటే కాలంతో కదలడం కాదు...
కాలాన్నే కదిలించడం!

ఈ బతుకు పోరు ఆగదు...
ఈ అడుగు ఎక్కడా ఆగదు...
చివరి శ్వాస ఉన్నంతవరకు
చివరి ఆశ ఉన్నంతవరకు
చివరి అడుగు పడేంతవరకు

బతుకుతాం... పోరాడుతాం...
పోరాడుతూ బతుకుతాం...!
బతుకు పోరులో అలసిన ఓ అభాగ్య జీవి



దేశిని శ్రీధర్ గౌడ్ (హన్మకొండ)

# అయ్యప్ప




1)కం॥ అయ్యా అనగా తండ్రే
అయ్యేనప్పా,యనంటేనాతను, తండ్రే
అయ్యప్పా యను పేరున
అయ్యా అప్పా పదాలు
అయినా వేకం.

2)కం॥ హరిహర సుతుడంటారే
హరి హర లిలువురు మగాళ్లె
అయి నప్పుడెలా?
పురుడును పోసేసుకొనే
-దెరిగింపగ, కోరుచుంటి దివిజులనెల్లన్.

3)కం॥ హరిమోహినిగా మారగ
హరుడామెను కాంక్షజేసి
అంకము జేరన్ పురుషుండొక,దుద్భవ ,మవ
నరులందరు,జేరి కొలువ
నాయెగదయ్యా.

4)కం॥ నరులారా అయ్యప్పను
హరి హరు, సుతుడన,వలదని
అరిచే నయ్యా.
సురులు అసురులెవరైనా
సరె యనవలె నాదుమాట
సత్యం బనుచున్.

5)కం॥ అయ్యప్పా నీ వెందుకు?
అయ్యోకుయ్యో అనేవు
అబ్బుర పడుచున్.
సైయ్యన్నా అనకున్నా నొయ్యకు నా పలుకు వినుచునోరిమితోడన్.



ఎన్.బాలరాజు-రసస్రవంతి,
వేములవాడ-7075505464.

# వీణవంకలో పెట్రోల్ బంకులపై అనుమానాలెందుకు?

- **అనుమతులు.. పంచాయతీ పన్నులు.. నిబంధనల అమలుపై ప్రశ్నలు**
- **వివరాలు కోరినా స్పందన కరువు.. పక్కపక్కనే బంకుల ఏర్పాటుపై వినియోగదారుల అభ్యంతరాలు**




**(కరీంనగర్ జోర్దార్ నిఘా బృందం)**వీణవంక మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణ, అనుమతులు, పంచాయతీ పన్నుల వసూళ్లు, ప్రభుత్వ నిబంధనల అమలుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెట్రోల్ బంకులకు సంబంధించిన వివరాలు, అనుమతులు, పంచాయతీకి చెల్లిస్తున్న పన్నులపై సమాచారం కోరినా కొంత మంది గ్రామ కార్యదర్శుల నుంచి రోజుల తరబడి స్పందన రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా వీణవంక పరిధిలోని ఓ గ్రామానికి సంబంధించి పెట్రోల్ బంకుల అనుమతులు, పంచాయతీకి చెల్లిస్తున్న పన్నుల వివరాలపై గ్రామ కార్యదర్శిని సమాచారం కోరగా 20 రోజులు గడిచినా స్పష్టత రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

**పక్కపక్కనే బంకులు ఎలా..?**

మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఒక పెట్రోల్ బంకుకు సమీపంలోనే మరో బంకు ఏర్పాటవుతున్న తీరుపై వినియోగదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అనుమతులకు ఏ నిబంధనలు వర్తిస్తాయి? దూర నిబంధనలు పాటించారా? స్థల అనుమతులు, పంచాయతీ తీర్మానాలు, ఇతర అనుమతులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**పంచాయతీ పన్నుల వసూళ్లపై కూడా ప్రశ్నలు**

కొన్ని పెట్రోల్ బంకుల నుంచి గ్రామపంచాయతీకి రావాల్సిన పన్నులు పూర్తిస్థాయిలో వసూలవుతున్నాయా? లేదా అనే అంశంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు కార్యదర్శులు బంకుల నుంచి రావాల్సిన పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

**తనిఖీలు.. పర్యవేక్షణ ఎక్కడ?**

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు టాయిలెట్లు, పరిశుభ్రత, ఉచిత గాలి వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా? తూనికలు, కొలతలు సక్రమంగా ఉన్నాయా? ఇంధన నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. అయితే వినియోగదారులు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో ఫిర్యాదులు వచ్చినప్పుడు కఠినంగా స్పందించిన అధికారులు ప్రస్తుతం ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీణవంక మండలంలోని అన్ని పెట్రోల్ బంకుల అనుమతులు, పంచాయతీ రికార్డులు, పన్నుల చెల్లింపులు, దూర నిబంధనలు, సౌకర్యాలు, తూనికలు, కొలతలపై సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని వినియోగదారులు కోరుతున్నారు. వీణవంకలో పెట్రోల్ బంకుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# హుజూరాబాద్ లో అంగన్వాడి ఉద్యోగాల పేరుతో మాయాజాలం?

- **ఒక్కో ఉద్యోగానికి రూ.3 లక్షల డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు**
- **ఇంటర్వ్యూలే జరగలేదు.. ప్రభుత్వ లోగో లేని పత్రాలపై అనుమానాలు**
- **బ్రోకర్ల మాటలు నమ్మొద్దు.. నయాపైసా ఎవరికీ ఇవ్వొద్దు: సీడీపీఓ సుగుణ**



GOVERNMENT OF TELANGANA
DEAPRTMENT OF WOMEN DEVELOPMENT & CHILD WELFARE
OFFICE OF THE DISTRICT COLLECTOR & DISTRICT LEVEL SELECTION

Proceedngs No. 920/ICDS-7/2026

Reporting timeline: The candidate must report for duty to the concerned (CDPO) within twenty (20) days from the date of receipt of this order.

District Level Selection Committee
DLSC
Karimnagar

**హుజూరాబాద్:**హుజూరాబాద్ ప్రాంతంలోని అంగన్వాడి కేంద్రాలకు సంబంధించిన ఉద్యోగాల భర్తీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అంగన్వాడి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు, బ్రోకర్లు అభ్యర్థులను సంప్రదిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఒక్కో ఉద్యోగానికి సుమారు రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

**ఇంటర్వ్యూ జరగకుండానే ఉద్యోగాలా?**

అంగన్వాడి ఉద్యోగాల భర్తీకి సంబంధించి అధికారికంగా ఎంపిక ప్రక్రియ కొనసాగాల్సి ఉండగా, కొందరు వ్యక్తులు ఇంటర్వ్యూ లేకుండానే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అసలు ఇంటర్వ్యూలు నిర్వహించకుండానే నియామకాలు ఎలా జరుగుతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అంగన్వాడి ఉద్యోగాలకు సంబంధించి ఖాళీ పోస్టులు ఎన్ని ఉన్నాయి..? దరఖాస్తులు ఎన్ని వచ్చాయి..? ఎంపిక ప్రక్రియ ఏ విధంగా ఉంటుంది..? అభ్యర్థుల మెరిట్‌ను ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటారు..? అనే అంశాలపై స్పష్టత అవసరమని అభ్యర్థులు కోరుతున్నారు.

**ప్రభుత్వ లోగో లేని పత్రాలపై అనుమానాలు**

అంగన్వాడి ఉద్యోగాలకు సంబంధించినవిగా కొందరు చూపిస్తున్న పత్రాలపై తెలంగాణ ప్రభుత్వ అధికారిక లోగో లేకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. ఆయా పత్రాలను ఎవరు జారీ చేశారు..? వాటికి అధికారిక గుర్తింపు ఉందా..? సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖకు వాటితో ఏమైనా సంబంధం ఉందా..? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**బోగస్ సంఘాల పేరుతో వ్యవహారం?**

కొన్ని సంఘాలు, సంస్థల పేర్లను ఉపయోగించి అంగన్వాడి ఉద్యోగాలు ఇప్పిస్తామని అభ్యర్థులను నమ్మిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఆయా సంఘాలకు ఉద్యోగాల భర్తీలో అధికారికంగా ఎలాంటి పాత్ర ఉంది..? ప్రభుత్వ అనుమతి ఉందా..? లేక ఉద్యోగాల పేరుతో అభ్యర్థులను మోసం చేసేందుకు సంఘాల పేర్లను ఉపయోగిస్తున్నారా..? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది.

**బ్రోకర్ల మాటలు నమ్మొద్దు**

ఈ ఆరోపణలపై హుజూరాబాద్ సీడీపీఓ సుగుణ స్పష్టతనిచ్చారు. అంగన్వాడి ఉద్యోగాల భర్తీ విషయంలో అభ్యర్థులు ఎవరూ బ్రోకర్ల మాటలు నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. ఇప్పటివరకు ఇంటర్వ్యూలు జరగలేదని, ఉద్యోగాల కోసం ఎవరూ నయాపైసా కూడా ఎవరికీ ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

**మెరిట్ ప్రకారమే ఉద్యోగాలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని సీడీపీఓ సుగుణ తెలిపారు. ఎవరూ గాబరా పడాల్సిన అవసరం లేదని, మెరిట్ ఉన్న ప్రతి అభ్యర్థికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

అంగన్వాడి ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థి మార్కులను కూడా డిస్ప్లే చేస్తామని ఆమె తెలిపారు. దీంతో ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటిస్తామని అధికారులు చెబుతున్నారు.

**అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి**

అధికారుల పేర్లు, సంఘాల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఉద్యోగ నియామకానికి సంబంధించి అధికారిక ప్రకటనలు, సంబంధిత శాఖ నుంచి వెలువడే సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**విచారణతో తేలాల్సిన అంశాలు**

ఒక్కో అంగన్వాడి ఉద్యోగానికి రూ.3 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు నిజమా..? ఎవరు ఈ వసూళ్లకు పాల్పడుతున్నారు..? బోగస్ సంఘాల పేర్లు ఉపయోగిస్తున్నారా..? ప్రభుత్వ లోగో లేని పత్రాలు ఎక్కడి నుంచి వచ్చాయి..? అనే అంశాలపై సమగ్రంగా విచారణ జరిపితే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# 15 ఏండ్లుగా 'సమగ్ర' అన్యాయం..

- **26,041 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు కరువైన భవిష్యనిధి భద్రత!**
- **చట్టాలున్నా అమలుకాని ఈపీఎఫ్ (జ్యూఖీ) ప్రయోజనాలు**
- **దశాబ్దన్నర కాలంగా సామాజిక భద్రతకు నోచుకోని వైనం**
- **వయసు పైబడి రిటైర్ అవుతున్నా ఖాళీ చేతులే దిక్కు**
- **ప్రభుత్వాలు మారుతున్నా మారని ఉద్యోగుల తలరాతలు**

**హైదరాబాద్ (జోర్దార్ ప్రతినిధి):**దేశంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి అహర్నిశలూ శ్రమిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాలు చీకట్లోనే మగ్గుతున్నాయి. గత 15 సంవత్సరాలుగా విధుల్లో కొనసాగుతున్న 26,041 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు చట్టబద్ధంగా దక్కాల్సిన ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ (జ్యూఖీ) సౌకర్యం నేటికీ అమలు కాకపోవడం వారి పట్ల జరుగుతున్న ఘోర అన్యాయానికి అద్దం పడుతోంది.

సమాన పనికి సమాన వేతనం దేవుడెరుగు, కనీసం పదవీ విరమణ తర్వాత జీవితానికి భరోసానిచ్చే పీఎఫ్ కూడా లేకపోవడంతో వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలు సామాజిక, ఆర్థిక భద్రత లేక తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

**చట్టం ఏం చెబుతోంది ? పాలకులు ఏం చేస్తున్నారు?**

కేంద్ర ప్రభుత్వ 'ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (జ్యూఖీ) చట్టం, 1952' ప్రకారం 20 మంది కంటే ఎక్కువ సిబ్బంది ఉన్న ఏ ప్రభుత్వ, ప్రైవేట్ లేదా కాంట్రాక్ట్ సంస్థలోనైనా ఉద్యోగులకు పీఎఫ్ సదుపాయం కల్పించడం తప్పనిసరి. సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఎఫ్ హక్కులను నిరాకరించకూడదని స్పష్టమైన తీర్పులు ఇచ్చింది. కానీ, ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలోనే నడుస్తున్న సమగ్ర శిక్షా విభాగంలో మాత్రం ఈ చట్టాలు తుంగలో తొక్కబడుతున్నాయి. కేజీబీవీ (ఖ+దీం) ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు (జ౧ా), పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు మరియు కార్యాలయ సిబ్బందితో కలిపి మొత్తం 26,041 మంది ఉద్యోగులు దశాబ్దన్నర కాలంగా సామాజిక భద్రతకు నోచుకోకుండా వెట్టిచాకిరీ చేస్తున్నారు.

**15 ఏండ్ల శ్రమకు దక్కని గుర్తింపు:**

ఈ విభాగంలో చేరినప్పుడు ముప్పై ఏళ్ల వయసున్న యువకులు ఇప్పుడు యాభై ఏళ్లకు చేరుకున్నారు. కొందరు ఉద్యోగులు వయసు పైబడి, అనారోగ్య కారణాల వల్ల ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఖాళీ చేతులతో ఇళ్లకు వెళుతున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయే తప్ప, పీఎఫ్ ద్వారా అందే పెన్షన్ గానీ, ఇన్సూరెన్స్ వంటి కనీస సాయం కూడా అందడం లేదు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వాలు చేస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనే అని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

**హామీలు నీటి మూటలేనా?**

ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను తీరుస్తామని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తామని, వేతనాలు పెంచుతామని హామీల వర్షం కురిపిస్తున్నాయి. కానీ, అధికార పీఠం ఎక్కాక బడ్జెట్ సాకులు చెపుతూ కాలయాపన చేయడం పరిపాటిగా మారింది. నెలల తరబడి వేతనాలు ఆలస్యం కావడం ఒకవైపు, భవిష్యత్తుకు భరోసా లేకపోవడం మరోవైపు ఉద్యోగులను అప్పుల ఊబిలోకి నెడుతోంది. ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్లు

**వెనువెంటనే ఈపీఎఫ్ అమలు:** 26,041 మంది ఉద్యోగులందరికీ తక్షణమే ఈపీఎఫ్ ఖాతాలను ప్రారంభించి పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.

**రెట్రోస్పెక్టివ్ (గత కాలం) నుండి చెల్లింపు:** ఉద్యోగులు విధుల్లో చేరిన నాటి నుండి (గత 15 ఏండ్ల కాలానికి) ప్రభుత్వ యాజమాన్య వాటాను లెక్కగట్టి ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలి, అప్పుడే సీనియర్ ఉద్యోగులకు న్యాయం జరుగుతుంది.

**సామాజిక భద్రత:** పీఎఫ్‌తో పాటు ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. విద్యా రంగాన్ని నడిపిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి సరికాదు. చట్టబద్ధమైన హక్కు అయిన భవిష్యనిధిని 15 ఏళ్లుగా నిరాకరించడం శ్రమ దోపిడీ కిందకే వస్తుంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి 26,041 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు 'ఈపీఎఫ్' వర్తింపజేసి, వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

# వైద్యం ముసుగులో అక్రమ సంపాదన..

## వైద్యాధికారి ఇంట్లో కోట్ల ఆస్తులు!

- **రూ.6.13 కోట్ల అక్రమాస్తుల ఆరోపణలు.. ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ ఏకకాల దాడులు**

**(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)** ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వ వైద్యశాలలోనే అక్రమ సంపాదనకు పాల్పడ్డారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. నిజాం వైద్య విజ్ఞాన సంస్థలో అదనపు వైద్య పర్యవేక్షణాధికారిగా పనిచేస్తున్న నోరి లక్ష్మీ భాస్కర్రెడ్డి తెలిసిన ఆదాయానికి మించి రూ. 6.13 కోట్ల ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. మంగళవారం ఉదయం నుంచి ఆయన నివా సంతో పాటు బంధువులు, సన్నిహితులు, మధ్య వర్తులకు సంబంధించిన ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించిన అధికారులు భారీగా ఆస్తులను గుర్తించినట్లు వెల్లడించారు.

**భారీగా నగదు, బంగారం, వాహనాలు**

**అధికారులు గుర్తించిన వివరాల ప్రకారం** బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షలు, తపాలా పొదుపు ఖాతాల్లో రూ. 12 లక్షలు, ప్రైవేటు ఆర్థిక సంస్థల్లో రూ. 35 లక్షలు, వివిధ పెట్టుబడి పథకాల్లో రూ. 29.55 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఖరీదైన కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**హైదరాబాద్ నుంచి విశాఖ వరకు ఆస్తులు**

స్థిరాస్తుల విషయంలోనూ భారీగా పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కూకట్‌పల్లిలోని నివాస సముదాయంలో ఒక నాలుగు పడక గదుల ఇల్లు, రెండు మూడు పడక గదుల ఇళ్లు, మణికొండ, పేట్‌బషీరాబాద్, కూకట్‌పల్లిలో మరో ఐదు రెండు పడక గదుల ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. యాదాద్రి, నందిగామ, శామీర్‌పేట ప్రాంతాల్లో నాలుగు ఖాళీ స్థలాలతో పాటు విశాఖపట్నంలో 800 చదరపు గజాల స్థలం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

వివాదంలో ఉన్న ఓ నివాసం కోసం రూ. 1.30 కోట్లు పెట్టుబడి పెట్టడంతో పాటు, పలువురికి రూ. 1.33 కోట్లు అప్పుగా ఇచ్చినట్లు కూడా దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. మరిన్ని ఆస్తులు ఉండే అవకాశం ఉందని అనుమానిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**ప్రభుత్వ ఉద్యోగికి ఇన్ని ఆస్తులు ఎలా?**

ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి ఆదాయానికి మించి ఇంత భారీగా ఆస్తులు ఎలా కూడబెట్టారన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రతిష్టాత్మక ప్రభుత్వ వైద్య సంస్థలో ఉన్నతస్థాయిలో పనిచేస్తున్న అధికారిపై ఇలాంటి ఆరోపణలు రావడం వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.ప్రస్తుతం అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, గుర్తించిన ఆస్తులపై మరింతగా పరిశీలన చేస్తున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు.

**పారదర్శక దర్యాప్తు అవసరం**

వైద్యుడిని దేవుడితో సమానంగా భావించే ప్రజల నమ్మకాన్ని ఇలాంటి ఆరోపణలు దెబ్బతీస్తున్నాయి. ప్రతిష్టాత్మక ప్రభుత్వ వైద్య సంస్థలోనే కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. అవినీతి నిరోధక శాఖ దాడులతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, ఇంకా ఎన్ని ఆస్తులు బయటపడతాయన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# ఐపీఎల్ ఫ్యాన్స్ కు బిగ్ సర్ప్రైజ్.. చెన్నై సూపర్ కింగ్స్ కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఖ్రూా) చరిత్రలో భారీ పాపులారిటీ ఉన్న జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) మేనేజ్‌మెంట్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ 2027 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, భారత మాజీ పేస్ దిగ్గజం జహీర్ ఖాన్ (ఘ్రవవతీ ఖఘ్రుఅ)ను తమ జట్టుకు కొత్త హెడ్ కోచ్(ఎముఉ జఘ్రుఎష్ట్ర)గా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత అనేక సంవత్సరాలుగా సీఎస్‌కే జట్టుకు కోచ్‌గా సేవలందించి, జట్టును ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ (ౌవజూష్ట్రవఅ ఖీశ్రీవఎఱఅస్త్ర) స్థానంలో జహీర్ ఖాన్ ఈ బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.దాదాపు 19 సంవత్సరాల పాటు చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో విడదీయరాని బంధాన్ని కొనసాగించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్, ఇటీవల తన పదవికి వీడ్కోలు పలికారు. గత సీజన్లలో జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం, అలాగే ఆయన ఇంగ్లాండ్ పురుషుల టెస్ట్ జట్టుకు హెచ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి నిర్ణయించుకోవడంతో ఈ మార్పు జరిగిందని తెలుస్తోంది. ఫ్లెమింగ్ లాంటి దిగ్గజ కోచ్ తప్పుకోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన వ్యక్తి కోసం వెతికిన సీఎస్‌కే యాజమాన్యం, అంతర్జాతీయ క్రికెట్‌లో అపార అనుభవమున్న జహీర్ ఖాన్ వైపు మొగ్గు చూపింది.

2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న జహీర్ ఖాన్, గతంలో ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు మెంటార్‌గా, కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా పనిచేసిన అపార అనుభవం కలిగి ఉన్నారు. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ (మీా ఐష్ట్రశీఅఱ) కెప్టెన్సీలో జహీర్ అంతర్జాతీయ క్రికెట్ ఆడటం వల్ల, ధోనీతో ఆయనకు మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ కారణంగానే సీఎస్‌కే జట్టులో జహీర్ నియామకం వెనుక ధోనీ సిఫారసు కూడా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, సీఎస్‌కే ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో జహీర్ ఖాన్ వ్యూహాలు జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడంలో ఎంతవరకు సఫలమవుతాయనేది ఆసక్తికరంగా మారింది.

గత కొన్ని సీజన్లుగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఎల్లో ఆర్మీవచ్చే ఐపీఎల్ 2027 సీజన్ కోసం పూర్తిగా కొత్త వ్యూహాలతో సిద్ధమవుతోంది. యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో, ముఖ్యంగా ఫాస్ట్ బౌలింగ్‌ను మెరుగుపరచడంలో జహీర్ ఖాన్‌కు ప్రత్యేక నైపుణ్యం ఉంది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో యువ పేసర్లకు శిక్షణ ఇచ్చిన అనుభవం ఉన్న జహీర్, ఇప్పుడు చెన్నై జట్టులోని పేస్ అటాక్‌ను మరింత పటిష్టం చేస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. కొత్త కోచ్ రాకతో చెన్నై జట్టు మళ్లీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని ట్రోఫీ రేసులో నిలవాలని

# హెచ్‌సీఏ మహిళల అండర్-19 టీ20 టోర్నీకి రంగం సిద్ధం



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్మహిళల అండర్– విభాగంలో నిర్వహించనున్న టీ20 సూపర్ లీగ్టోర్నీకి సంబంధించి మొత్తం ఎనిమిది జట్లను మంగళవారం అధికారికంగా వెల్లడించింది. క్రికెట్‌లో అత్యంత పోట్టి ఫార్మాట్‌లో వర్ధమాన మహిళా క్రికెటర్ల సత్తా చాటేందుకు ఈ లీగ్ వేదిక కానుంది. యువ క్రీడాకారిణులకు నాణ్యమైన మ్యాచ్ అనుభవం కల్పించడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించే లక్ష్యంతో ఈ జట్లను ఎంపిక చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన అమ్మాయిలకు ఈ జట్లలో చోటు దక్కింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు భవిష్యత్తులో ఉన్నత స్థాయి అవకాశాలు దక్కే వీలుంది.జట్ల వివరాల్లోకి వెళితే, టీమ్ ఏం జట్టుకు కమ్మిలి నిధి) కెప్టెన్, వికెట్ కీపర్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో సి.దీక్షిత, జాజ్మిన్ గిల్, బి.కీర్తన, అక్షర గుండు, కె.అర్పిత, దృవిజ్ఞ, అల్లం సృష్టి, సిమ్రాన్ యాదవ్, శ్రీజ, మిద్దెల లికిల (నల్గొండ), ముదావత్ సింధుజ ఎంపికయ్యారు.టీమ్ బిం బృందానికి జి.కావ్య శ్రీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, నందిగామ అక్షయ, ఆదిమూలం హాసిని, బి.గీతిక ప్రియదర్శిని, వేముల జెనిక్ష, ఆయిషా షేక్, తూము అనన్య, రుక్సార్, ప్రవళిక, తలారి సంసిత, పన్యాల సహస్ర, ప్రణవి సభ్యులుగా ఉన్నారు.టీమ్ సిం జట్టుకు కట్టా తేజస్విని సారథ్యం వహిస్తుండగా, ప్రతీక కంచర్ల, ఎడ్ల దర్శిని, లింగంపల్లి లక్ష్మి సహస్ర, జి.హేష్మిత శ్రీ, సుప్రీత, బుక్య శారద, నక్కా నిధి కృష్ణ, మేఘన గౌడ్, పట్టిక షాన్వి, సామల చిద్విలాసిని, అంకెనగారి సుచరిత స్థానం సంపాదించారు.టీమ్ డిం జట్టుకు ఎం.శ్రీ గ్రంథ నాయకత్వం వహిస్తున్నారు. ఇందులో ఆర్.లలిత, సజ్జా నాగ శ్రీ చరిత, ఎన్.నీతా శాశ్వత, ప్రతీక, టి.జాహ్నవి, పి.తనుషిక, కె.సహస్ర, ఝాన్సీ, లకవత్ చైతన్య, కన్నం శ్రేయ, సోనాలి ఆడనున్నారు.టీమ్ ఈం జట్టు పగ్గాలను ఎం.చార్వి లక్ష్మి శ్రీ అందుకోగా, వై.ఈశ్వరి, ఎం.అక్షిత గౌడ్, సాయి తనుశ్రీ, స్వాగతిక పాండ, సి.నాగ రూపిణి, పోలమ శ్రీవాస్తవ, పెవల్ తనీష, ముత్యాల అనిక, వానరాసి ప్రసన్న, సి.జయ కాత్యాయని, బుచ్చి హాసిని ఉన్నారు.మిగిలిన జట్లలో టీమ్ ఎఫ్ం జట్టుకు ఎన్.బబిత ఫ్టెన్‌గా ఉండనున్నారు. సి.నాగసాయి అక్షిత, బొక్క దీప్షిక, డి.అనన్య, టి.హర్షిణి, పూర్క రిషిమ, డి.నిష్ట, ధరావత్ రిషిక, ఇ.గౌతమి, పూర్వ లాహోటి, నవురు సంజన, ఎ.జుచితా రెడ్డి జట్టులో చోటు దక్కించుకున్నారు.టీమ్ జిం బృందాన్ని ప్రతీక్ష వెంకటేషనడిపించనుండగా, శరగూడం మిత్ర, పి.బంధన, హీరల్ జోషి, ధరావత్ శ్రావణి, యమున, అక్కీ ఆశ్రిత, ఆస్థా శర్మ, సముద్రాల ఇనాయ, శ్రీ సహస్ర రాజ్, డి.ప్రణవి, ఉదయ చంద్రిక బరిలోకి దిగుతారు.ఇక టీమ్ హెచ్ం జట్టుకు పి.అక్షయ రెడ్డి ( సారథిగా వ్యవహరించనున్నారు. ప్రాచీ యాదవ్, వి.నికేషిణి, ఎల్.శ్రుతిక, కె.అనేరా శాంత్, స్రవంతి, నిత్యశ్రీ, నెల్లుట్ల అక్షయ, కొడిగంటి మనీషా, డివిఎన్‌ఎం శ్రీ రెణ్య, పప్పు కీర్తన, హరిణి ఈ జట్టుకు ఎంపికయ్యారు. ఈ యువ ప్లేయర్లు తమ ప్రతిభతో లీగ్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

# విరాట్, రోహిత్‌ల గురించి విండీస్ ప్లేయర్ సంచలన వ్యాఖ్యలు




భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక వన్డే సిరీస్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న ఈ సిరీస్ ద్వారా భారత్‌లో హోమ్ సీజన్ కూడా మొదలుకానుంది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్ సీనియర్ ఆల్ రౌండర్ జెసన్ హోల్డర్ ప్రముఖ మీడియాతో మాట్లాడుతూ భారత జట్టుపై, ముఖ్యంగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, యువ కెప్టెన్ శుభమన్ గిల్ గురించి తన మనసులోని మాటలను పంచుకున్నారు. ప్రపంచ క్రికెట్‌లో ఈ దిగ్గజాల పాత్ర ఎంత కీలకమో ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

శుభమన్ గిల్ కెప్టెన్సీపై హోల్డర్ ప్రశంసలు

ఐపీఎల్‌లో శుభమన్ గిల్ కెప్టెన్సీలో ఆడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ జెసన్ హోల్డర్ తన నాయకత్వ లక్షణాలను కొనియాడారు. గిల్ చాలా ప్రశాంతంగా ఉంటాడని, ఎక్కడా ఆందోళన చెందకుండా స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తాడని తెలిపారు. మైదానంలో బౌలర్లకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ, వారిని నమ్ముకుని ఫీల్డ్ సెట్ చేసుకునే అవకాశమిస్తాడని హోల్డర్ వెల్లడించారు. గిల్ ఇంకా యువ కెప్టెన్ అయినప్పటికీ, మ్యాచ్‌లు ఆడుతూ ఎంతో వేగంగా నేర్చుకుంటున్నాడని, భవిష్యత్తులో అతను మరింత గొప్ప నాయకుడిగా ఎదుగుతాడని ప్రశంసించారు.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై ఏమన్నారంటే

భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల గురించి మాట్లాడుతూ జెసన్ హోల్డర్ ఆసక్తికరమైన కామెంట్లు చేశారు. విరాట్ కోహ్లీ బహుశా వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ అని, అతన్ని మైదానంలో చూడటమే ఒక అద్భుతమని కొనియాడారు. అలాగే రోహిత్ శర్మకు కూడా వన్డేల్లో అద్భుతమైన రికార్డు ఉందని, ముఖ్యంగా వెస్టిండీస్ జట్టుపై అతను ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాడని గుర్తుచేశారు. ఈ ఇద్దరు లెజెండ్స్‌తో తలపడటం ఏ బౌలర్‌కైనా సవాల్‌తో కూడుకున్న విషయమేనని, అలాంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో పోటీ పడటాన్ని తాను ఎప్పుడూ ఆస్వాదిస్తానని హోల్డర్ చెప్పారు.

గుర్నూర్ బ్రార్ పై ప్రశంసలు

ఇదే ఇంటర్వ్యూలో గుజరాత్ టైటాన్స్ జట్టులో తాను దగ్గరగా చూసిన యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ప్రతిభను హోల్డర్ ఎంతగానో మెచ్చుకున్నారు. బ్రార్ వద్ద అద్భుతమైన వేగంతో పాటు మంచి బౌన్సీ డెలివరీలు ఇచ్చే ఎత్తు ఉందని, అతనికి భవిష్యత్తులో గొప్ప కెరీర్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రాబోయే వన్డే సిరీస్ ఇటు వెస్టిండీస్ జట్టుకు, అటు టీమిండియాకు ఎంతో కీలకమని, ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లు హోరాహోరీ పోరు సాగుతుందని ఆయన అంచనా వేశారు.

# హోమ్ లోన్ జం ప్రాపర్టీ లోన్.. మీకు ఏది బెస్ట్..? ఈ చిన్న తప్పులతో జేబుకు చిల్లే..!




మనిషి జీవితంలో ఆర్థిక భద్రతను నిర్మించుకోవడంలో స్థిరాస్తుల కొనుగోలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికో లేదా ఇప్పటికే ఉన్న ఆస్తుల విలువ ఆధారంగా తక్షణ అవసరాలకు డబ్బుల కోసం బ్యాంకులు ప్రధానంగా రెండు రకాల లోన్ సౌకర్యాలను అందిస్తున్నాయి. అవే హోమ్ లోన్, ప్రాపర్టీ లోన్. ఈ రెండింటి నిబంధనలు పూర్తిగా వేర్వేరు కాబట్టి మీ ప్రస్తుత అవసరానికి తగినదాన్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. హోమ్ లోన్ అనేది కొత్తగా ఒక ఇంటిని, ఫ్లాట్‌ను కొనడానికి లేదా సొంత స్థలంలో నూతన ఇళ్లు నిర్మించుకోవడానికి మాత్రమే బ్యాంకులు మంజూరు చేసే లోన్. దీనిని పొందడానికి దరఖాస్తుదారుడికి మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో పాటు లోన్ సకాలంలో చెల్లించగల స్థిరమైన ఆదాయం ఉండటం తప్పనిసరి. బ్యాంకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా హోమ్ లోన్లకు వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో పాటు 20 నుంచి 30 సంవత్సరాల వరకు సుదీర్ఘ కాలవ్యవధిలో రీపేమెంట్ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది.

మరోవైపు ఆస్తిపై లోన్ అనేది ఇప్పటికే మీ పేరిట ఉన్న నివాస లేదా వాణిజ్య స్థలాన్ని బ్యాంకు వద్ద తాకట్టు పెట్టి నగదు పొందే పద్ధతి. ఇందులో వచ్చే నిధులను ఇంటి నిర్మాణానికే కాకుండా వ్యాపార విస్తరణ, ఉన్నత చదువులు, వివాహ ఖర్చులు లేదా అత్యవసర వైద్య ఖర్చుల వంటి ఏ అవసరానికైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ లోన్‌లో మీ ఆస్తి మార్కెట్ విలువను బట్టి మాత్రమే డబ్బులు వస్తాయి. ఉదాహరణకు మీ ఆస్తి విలువ రూ.1 కోటి ఉంటే బ్యాంకు రూల్స్ ప్రకారం రూ. 50 లక్షల నుండి రూ. 70 లక్షల వరకే లోన్ లభిస్తుంది తప్ప పూర్తి కోటి రూపాయలు ఇవ్వరు. ఈ రెండింటిలో ఏది మీకు సరైనదో తేల్చుకోవడానికి మీ అవసరమే గీటురాయి. మీరు కొత్తగా ఇంటిని తీసుకోవడం లేదా సొంత స్థలంలో కట్టుకోవాలనుకుంటే తక్కువ వడ్డీకే లభించే హోమ్ లోన్ బెస్ట్ ఆప్షన్. అలా కాకుండా ఇప్పటికే మీ వద్ద ఉన్న ఫ్లాట్ లేదా ఖాళీ స్థలాన్ని ఉపయోగించి కొత్త వ్యాపారం ప్రారంభించాలన్నా, లేదా పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైనా దాన్నిపై లోన్ తీసుకోవడం సరైన అవుతుంది.

# ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ డేట్స్ వచ్చేశాయ్.. డిస్కౌంట్లు చూస్తే నోరెళ్లాబెట్టాల్సిందే..




ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ డేట్స్ వచ్చేశాయి. ఈ మెగా సేల్ అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్నట్లు ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్ తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక మైక్రోసైట్‌ను లైవ్ చేస్తూ, బ్యాంక్ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్ల వివరాలను వెల్లడించింది. సాధారణ యూజర్ల కంటే ఒక రోజు ముందుగానే ప్లస్ మెంబర్స్‌కు ఈ సేల్ అందుబాటులోకి రానుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ , ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులు, ఫ్లిప్‌కార్ట్ క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు ఈ 24 గంటల ఎర్లీ యాక్సెస్ లభిస్తుంది. ప్రధాన సేల్ ప్రారంభం కాకముందే పరిమిత స్టాక్ ఉండే హాట్ డీల్స్‌ను దక్కించుకునే అవకాశం వీరికి దక్కుతుంది.బ్యాంక్ ఆఫర్లు -- క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు మైక్రోసైట్‌లో పొందుపరిచిన సమాచారం ప్రకారం కస్టమర్లకు భారీ ఆర్థిక రాయితీలు లభించనున్నాయి.తక్షణ డిస్కౌంట్: యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులను ఉపయోగించి చేసే కొనుగోళ్లపై గరిష్టంగా 10శాతం తక్షణ తగ్గింపు లభిస్తుందిఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్: ఈ కార్డు వినియోగదారులు అదనంగా 10 శాతం వరకు పొదుపు చేయవచ్చు.సూపర్ మనీ : మొదటి లావాదేవీపై 10శాతం క్యాష్‌బ్యాక్ అందించనున్నారు.యూపీఐ, ఇతర ప్రముఖ పేమెంట్ గేట్‌వేల ద్వారా చెల్లింపులు జరిపే వారికి సైతం ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు ఉంటాయని సంస్థ తెలిపింది.ఏయే భాగాల్లో భారీ తగ్గింపులు?నిర్దిష్ట ఉత్పత్తుల వారీగా ఇంకా ధరలను అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లైయన్స్‌పై భారీ తగ్గింపులు ఉండనున్నట్లు స్పష్టమైంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పీసీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఆడియో డివైజ్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ హోమ్ అప్లయన్సెస్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్స్ ఉండనున్నాయి.ఐఫోన్, శాంసంగ్ డీల్‌కొత్త మొబైల్ కొనాలనుకునే వారికి బిగ్ బిలియన్ డేస్ సేల్ అత్యుత్తమ వేదిక కానుంది.ఆపిల్ ఐఫోన్లు: ఇటీవల ఆపిల్ కొత్త ఐఫోన్ 18 ప్రో సిరీస్‌ను ఆవిష్కరించిన నేపథ్యంలో మునుపటి మోడళ్లయిన ఐఫోన్ 16, ఐఫోన్ 17 సిరీస్‌లపై అదిరిపోయే ప్రైస్ కట్స్ వచ్చే అవకాశం ఉంది.శాంసంగ్ గెలాక్సీ: శాంసంగ్ ప్రీమియం ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్26 సిరీస్‌పై కూడా ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ధరల తగ్గింపు ఉండవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా మెమరీ చిప్‌ల కొరత నెలకొన్నందున కొన్ని ఫోన్ల లభ్యత, తుది ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది.సేల్ ప్రారంభ సమయం దగ్గరపడే కొద్దీ నిర్దిష్ట ప్రోడక్ట్ డీల్స్‌ను ఫ్లిప్‌కార్ట్ ఒక్కొక్కటిగా రివీల్ చేయనుంది. పండుగ సీజన్ షాపింగ్ కోసం వినియోగదారులు ఇప్పటి నుంచే తమ విష్‌లిస్ట్‌లను సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పడిపోతున్న బంగారం, వెండి ధరలు.. రెండు రోజుల్లో ఎంత తగ్గిందంటే..



బంగారం కొనేందుకు సిద్ధమవుతున్న వారికి శుభవార్త. ఇటీవల గోల్డ్ రేటు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో శని, శుక్రవారాల్లోనూ ధర భారీగా పెరిగింది. అయితే, ఇవాళ మాత్రం గోల్డ్ రేటు కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే గత రెండు రోజుల్లో సుమారు వెయ్యి రూపాయల వరకు దిగి వచ్చింది.ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉన్నాయి. అయితే, బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీపావళి నాటికి బంగారం గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి, 10 గ్రాములకు రూ.1.80 లక్షలను దాటవచ్చని కూడా వారు పేర్కొంటున్నారు.తాజాగా మంగళవారం (సెప్టెంబర్ 22) దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. అయితే ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. ప్రధాన నగరాల్లో ధరల వివరాలు.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర వద్ద కొనసాగుతోంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,720 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,840 వద్ద కొనసాగుతోంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. ప్రస్తుతం కిలో గ్రాము వెండి ధర రూ.2,49,900 వద్ద ట్రేడవుతోంది.

బుధవారం,
సెప్టెంబర్ 23 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# అంత అన్యాయం జరిగితే పోలీసులు ఎందుకు రాలేదు.



చాలా కాలం తర్వాత టాలీవుడ్ మాస్ హీరో రవితేజ కెరీర్ మలుపు తిప్పిన సినిమా ఇరుముడి. కొన్నాళ్లుగా సరైన హిట్టు కోసం ఎదురుచూస్తున్న ఈ హీరోకు ఈ మూవీ సరైన బ్రేక్ ఇచ్చిందనే చెప్పాలి. రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. థియేటర్లలోనే కాకుండా ఇటీవల ఓటీటీలోనూ అడుగుపెట్టిన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. అయితే, సినిమాలో ఊరి నేపథ్యంలో అంత పెద్ద క్రైమ్ యాంగిల్ జరిగినా, ఎక్కడా పోలీసుల ఇన్వెస్టిగేషన్ లేదా ఎస్సై ఎంక్వైరీ పాత్రలు కనిపించకపోవడంపై సోషల్ మీడియాలో ట్రోల్స్, ప్రశ్నలు మొదలయ్యాయి. దీనిపై దర్శకుడు శివ నిర్వాణ స్పందిస్తూ ట్రోలర్స్‌కు దిమ్మతిరిగే వివరణ ఇచ్చారు. సినిమాలో పోలీస్ లేయర్‌ను కావాలనే పక్కన పెట్టానని శివ నిర్వాణ స్పష్టం చేశారు."ఒకవేళ సీన్‌లోకి ఎస్సై వచ్చి ఎంక్వైరీ మొదలుపెడితే, ప్రేక్షకులు పాత్రల తాలూకు అంతర్మథనం, వారి భావోద్వేగ ప్రయాణాన్ని ఆస్వాదించడం మానేస్తారు. 'నేరం వెనుక ఎవరున్నారు? పోలీసులు ఎప్పుడు పట్టుకుంటారు?' అనే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ కోణంలోనే ఆలోచించడం మొదలుపెడతారు. దీంతో కథలోని అసలు ఎమోషన్ దెబ్బతింటుంది" అని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, సినిమాలో నేరాలకు కారణమైన వ్యక్తి పలుకుబడి ఉన్న ఎమ్మెల్యే అని, అతడు పోలీసులను రాకుండా తన అధికారాన్ని ఉపయోగించాడా లేదా అనే లీగల్ ప్రొసీజర్ మొత్తాన్ని 2 గంటల 20 నిమిషాల నిడివిలో చూపించడం అసాధ్యమని తెలిపారు.తాను ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు ఒక స్వచ్ఛమైన భావోద్వేగాన్ని అందించాలనుకున్నానని, క్రైమ్ డ్రామాగా మార్చి లీగల్ అంశాలతో ఆడియన్స్ దృష్టిని పక్కదారి పట్టించడం ఇష్టం లేకే పోలీస్ సీన్లను ఉద్దేశపూర్వకంగానే దూరంగా ఉంచినట్లు ఆయన వెల్లడించారు. కథలోని ఎమోషనల్

# నడవలేని స్థితిలో బెడ్ పై ఢీ ఫేమ్ పండు మాస్టర్





బుల్లితెరపై తన మార్క్ డ్యాన్స్‌తో, కామెడీతో మంచి గుర్తింపు తెచ్చుకున్న 'ఢీ' ఫేమ్ పండు (పండు మాస్టర్) ఇటీవల ఒక ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో వైద్యులు రెండు కాళ్లకు ఆపరేషన్ కూడా చేశారు. ప్రస్తుతం ఆయన కదల్లేని స్థితిలో బెడ్డుపైనే విశ్రాంతి తీసుకుంటున్నారు. మళ్లీ స్టేజ్‌పై మునుపటిలా డ్యాన్స్ స్టెప్పులు వేయడానికి ఆయనకు ఇంకా కొన్ని నెలల సమయం పట్టేలా కనిపిస్తోంది.ఈ క్రమంలో పండుకు ఉపాధి లేదా ఆదాయ మార్గం తాత్కాలికంగా ఆగిపోయింది. సాధారణంగా బుల్లితెర కళాకారులకు ప్రాజెక్ట్‌లు ఉన్నప్పుడే ఆదాయం వస్తుంది. నిలబడే పరిస్థితి లేకపోవడంతో పండుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఏర్పడింది. అందుకే ఆయన సొంతంగా ఒక యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటివరకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులను అలరించిన పండు, ఇకపై తన హెల్త్ అప్‌డేట్స్, వ్యక్తిగత విషయాలు, ఇతర విశేషాలను యూట్యూబ్ ద్వారా పంచుకోనున్నారు.బెడ్డు మీద నుంచే ఒక ప్రత్యేక వీడియోను షూట్ చేస్తూ -- "ఇన్నాళ్లూ నన్ను ఎంతో ఆదరించారు. ఇప్పటివరకు ఇన్‌స్టాలో ఎంటర్‌టైన్ చేశాను. ఇకపై నా అప్‌డేట్స్ అన్నీ యూట్యూబ్‌లోనే ఇస్తాను. నా కొత్త ఛానెల్‌ని సబ్‌స్క్రైబ్ చేసుకుని నాకు సపోర్ట్ చేయండి" అని అభిమానులను, నెటిజన్లను వేడుకున్నారు.'ఢీ' షోలో ఒక సాధారణ డ్యాన్సర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన పండు, తన ప్రతిభతో కొరియోగ్రాఫర్‌గా ఎదిగాడు. ముఖ్యంగా 'నక్కిలీసు గొలుసు' పాటతో ఆయన క్రేజ్ రాత్రికి రాత్రే పెరిగిపోయింది. ఆ తర్వాత జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి పలు పాపులర్ షోలు, పండుగ ఈవెంట్లలో పాల్గొంటూ మంచి అభిమానాన్ని సంపాదించుకున్నాడు.పండు ప్రమాదానికి గురైన విషయం తెలిసి 'ఢీ' టీమ్‌తో పాటు యాంకర్ సుమ వంటి ప్రముఖులు కూడా ఆయనకు అండగా నిలిచారు. ఇటీవల ప్రారంభమవుతున్న కొత్త 'ఢీ' సీజన్‌లో పండు లేకపోవడం ఆయన అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. ఏది ఏమైనా, పండు త్వరగా కోలుకొని మళ్లీ డ్యాన్స్ ఫ్లోర్‌పైకి రావాలని ఆకాంక్షిస్తూ, ఆయన కొత్త యూట్యూబ్ ఛానెల్‌కి అభిమానులు భారీగా సపోర్ట్ అందిస్తున్నారు.

# ఆ కండిషన్‌తోనే బిగ్ బాస్ కు వెళ్ళా.. ఒక్క రూపాయి కూడా రాలేదు.



బాలీవుడ్‌లో తన డాన్స్, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా ఫతేహి.. ప్రస్తుతం భారతీయ సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. కెనడాకు చెందిన ఈ ముద్దుగుమ్మ డాన్స్ పెర్ఫార్మెన్స్‌తో పాటు మ్యూజిక్ ఆల్బమ్స్, సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా భారీ క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే నేడు స్టార్‌గా కొనసాగుతున్న నోరా ప్రయాణం అంత సులభంగా సాగలేదు. కెరీర్ ప్రారంభంలో ఆర్థిక ఇబ్బందులు, అవకాశాల కోసం ఎదురుచూపులు, పారితోషికం చెల్లింపుల విషయంలో ఎదురైన సమస్యలను ఆమె స్వయంగా వెల్లడించారు.

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.తొలినాళ్లలో రియాలిటీ షోలపై తనకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదని నోరా వెల్లడించారు. అందుకే బిగ్ బాస్ నిర్వాహకులు సంప్రదించినప్పుడు మొదట తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించానని చెప్పారు. అయితే షో ద్వారా లభించే పారితోషికం గురించి తెలుసుకున్న తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు నోరా తెలిపారు. అదే సమయంలో బిగ్ బాస్ వంటి భారీ






# నాని ది ప్యారడైజ్‌కు గ్రీన్ సిగ్నల్.. టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ది ప్యారడైజ్ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ది ప్యారడైజ్ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో సినిమా విడుదల సమయంలో సాధారణ టికెట్ ధరల కంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ప్రత్యేక ప్రీమియర్ షోకు కూడా పెంచిన ధరలను వర్తింపజేసేందుకు ప్రభుత్వం అనుమతించినట్లు తెలుస్తోంది.

సెప్టెంబర్ 23న మల్టీప్లెక్స్‌లలో నిర్వహించనున్న ప్రత్యేక ప్రీమియర్ షోకు టికెట్ ధరను రూ.400 వరకు పెంచుకునేందుకు అనుమతి లభించింది. అదే విధంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.300 వరకు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. దీంతో 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షోను ముందుగానే వీక్షించాలనుకునే అభిమానులకు టికెట్ ధరలు సాధారణ రోజులతో పోలిస్తే ఎక్కువగా ఉండనున్నాయి. సినిమా విడుదలైన తర్వాత కూడా టికెట్ ధరల పెంపు కొనసాగనుంది. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 వరకు మొత్తం 10 రోజుల పాటు పెంచిన టికెట్ ధరలను అమలు చేసేందుకు అనుమతి ఇచ్చింది ఏపీ సర్కార్.ఈ పది రోజుల వ్యవధిలో థియేటర్లలో రోజుకు 5 షోలు నిర్వహించుకునేందుకు అనుమతి లభించినట్లు సమాచారం. మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లకు వేర్వేరు ధరల పెంపును ప్రభుత్వం అనుమతించింది. మల్టీప్లెక్స్‌లలో: ఒక్కో టికెట్‌పై రూ.75 అదనంగా, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో: ఒక్కో టికెట్‌పై రూ.50 అదనంగా పెంచారు. కాగా ది ప్యారడైజ్ పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. విభిన్నమైన కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్న నేపథ్యంలో

# ఆ నటుడికి జరిగిన యాక్సిడెంట్ నా జీవితాన్ని మార్చేసింది





టాలీవుడ్ ఇండస్ట్రీలో దశాబ్దాలుగా తనదైన నటనతో అలరిస్తున్న విలక్షణ నటుడు రాజేంద్ర ప్రసాద్. ఇప్పటికీ వరుస చిత్రాల్లో కీలకపాత్రలు పోషిస్తున్నారు. తెలుగు సినీ నటులు రాజేంద్ర ప్రసాద్, దివంగత నూతన ప్రసాద్‌లకు 1980ల మధ్యలో జరిగిన ఓ విషాదకరమైన కారు ప్రమాదం వివరాలను రాజేంద్ర ప్రసాద్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "బామ్మ మాట బంగారు బాట" అనే సినిమా చిత్రీకరణ సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నూతన ప్రసాద్ తీవ్రంగా గాయపడి, జీవితాంతం పక్షవాతానికి గురయ్యారు. రాజేంద్ర ప్రసాద్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన తీరును రాజేంద్ర ప్రసాద్ వివరించారు. కారులో రాజేంద్ర ప్రసాద్ డ్రైవింగ్ సీట్‌లో, నూతన ప్రసాద్ వెనుక సీట్‌లో కూర్చుని ఉన్నారు. ఒక సన్నివేశం కోసం కారును క్రేన్ సహాయంతో పైకి లేపుతుండగా, క్రేన్ నుంచి ఐరన్ చైన్ లింక్ అనుకోకుండా ఊడిపోయింది. దీంతో కారు అదుపు తప్పి కిందకు దూసుకుపోయింది. ఈ ఘటన క్షణాల్లో జరిగిందని, కారు కింద పడే క్రమంలో నూతన ప్రసాద్ వెనుక సీటులో ఉండటం వల్ల ఆయన తల, కింది భాగం గట్టిగా నొక్కుకుపోయాయని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. దీనివల్ల నూతన ప్రసాద్ వెన్నెముకకు తీవ్రమైన గాయం తగిలి, రెండు కాళ్లు ప్యారలైజ్ అయ్యే పరిస్థితి ఏర్పడిందని వివరించారు.అదే సమయంలో, రాజేంద్ర ప్రసాద్‌ను ప్రమాదం తర్వాత కారులో నుంచి బయటికి తీస్తుండగా, ఆయనకు పెద్దగా దెబ్బలు తగలలేదని గుర్తించారు. నూతన ప్రసాద్ మాత్రం "నేను నడవలేకపోతున్నాను, నన్ను పట్టుకెళ్లండి" అని చెప్పినట్లు రాజేంద్ర ప్రసాద్ గుర్తు చేసుకున్నారు. ఈ ప్రమాదం జరిగిన మరుసటి రోజు ఓ వార్తాపత్రికలో "హీరో రాజేంద్ర ప్రసాద్‌కు తీవ్ర గాయాలు, నూతన ప్రసాద్‌కు స్వల్ప గాయాలు" అనే హెడ్‌లైన్స్‌తో వార్తలు వచ్చాయని రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. అయితే, వాస్తవానికి నూతన ప్రసాద్‌కే తీవ్రమైన గాయాలయ్యాయని, ఆయన ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిందని రాజేంద్ర ప్రసాద్

# అందుకే విడాకులు.. షాకింగ్ కామెంట్స్ చేసిన స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్.



డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా మన రోజువారీ జీవితంలో భాగాంగా మారిపోయాయి. అయితే టెక్నాలజీ ఎంత దగ్గర చేస్తుందో.. అంతే దూరం కూడా చేస్తోందనే చర్చ ఎక్కువగా వినిపిస్తోంది. ముఖ్యంగా భార్యాభర్తలు, ప్రేమికులు, కుటుంబ సభ్యుల మధ్య విషయాలకు కూడా సోషల్ మీడియా అడ్డంగా మారిందని చాలా మంది వాపోతున్నారు. ఇదే అంశంపై నటి కాజల్ అగర్వాల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజాగా కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో చాలామంది జంటలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి కూడా తగినంత సమయం కేటాయించడం లేదని ఆమె అన్నారు. ఒకే చోట కూర్చున్నప్పటికీ ఫోన్లలో సోషల్ మీడియా స్క్రోలింగ్ చేయడం, మెసేజ్‌లు చూడటం, ఇతర డిజిటల్ కంటెంట్‌లో మునిగిపోవడం వల్ల నిజమైన మాటలు తగ్గిపోతోందని కాజల్ అగర్వాల్ పేర్కొంది. అలాగే ఇటీవల విడాకులు పెరిగిపోవడం పై కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ..బిందాస్ మూవీ హీరోయిన్ ఇప్పుడు ఎలా ఉందో చూస్తే మతిపోవాల్సిందే.. ఇప్పుడు ఎలా ఉందంటేడిన్నర్‌కు కలిసి వెళ్లిన సమయంలో కూడా ఫోన్‌ను పక్కన పెట్టకుండా స్క్రీన్‌పైనే దృష్టి పెట్టడం వల్ల పార్ట్నర్స్ మధ్య ఉండాల్సిన అనుబంధం, పరస్పర అవగాహన దెబ్బతినే అవకాశం ఉందని కాజల్ అన్నారు. ఈ సందర్భంగా కాజల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలను కూడా పంచుకున్నారు.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224